వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 18 ఫిబ్రవరి 2023

## నిర్ధేశించిన లక్ష్యాలను అధికమించాలి

### అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ శైలజా



రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

ఆయుష్మాన్ భారత్, వెల్‌నెస్ సెంటర్‌లు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్‌లు నిర్ధేశించిన లక్ష్యాలను అధికమించాలని అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ శైలజా కోరారు. శుక్రవారం రాజంపేటలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టిబి, లెప్రసి, ఎయిడ్స్ పై క్రమం తప్పకుండా ప్రత్యేక పర్యవేక్షణ సాగాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లకు టార్గెట్‌లను వివరించారు. లెప్రసి వార్డును ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ సి.చిన్నిక్రిష్ణ, డాక్టర్ సానె శేఖర్, డాక్టర్ వికాస్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ లక్ష్మీప్రసన్న, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బస్ ఢీ.... ఇద్దరు మృతి -పలువురి పరిస్తితి విషమం



గాలివీడు.ఫిబ్రవరి17 ప్రభాతవార్త

గోరాన్‌చెరువు వద్ద ఆటో బస్ ఢీకొని ఆటో డ్రైవర్ మహబూబ్‌బాష (33), సాధిక్ (11) ఇద్దరు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళితే ఎస్సై వెంకటశివకుమార్ కథనం మేరకు గాలివీడు మండలం గొట్టివీడులోని ఒకే కుటుంబానికి చెందిన 7 మంది శుక్రవారం రాత్రి ఆటోలో గాలివీడుకు వెళుతూ మార్గమధ్యలో గోరాన్ చెరువు గుట్టవద్ద డంపింగ్ యార్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టిసి బస్ ఢీకొన్న సంఘటనలో ఇరువురు మృతి చెందగా 5 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పోలీస్‌లు స్పందించి 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సూచనమేరకు క్షతగాత్రులను అత్యవసర సేవలకై తిరుపతికి తరలించినట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# శివనామ స్మరణతో మార్మోగనున్న లంకమల్ల

### భారీగా లంకమల్లకు చేరుకున్న భక్తులు - పచ్చని చెట్ల మధ్య శివరాత్రి వేడుకలు

### ఏర్పాట్లు పూర్తిచేసిన పోలీసు, రెవిన్యూ, ఆరోగ్యశాఖ



- భక్తులకు దర్శనమిస్తున్న లంకమల్లేశ్వరుడు, లంకమల్లకు చేరుకున్న భక్తులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో కోనేరు.

బద్వేలు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లంకమల్ల అభయారణ్యంలో వెలసిన శ్రీ లంకమల్లేశ్వరున్ని దర్శించుకునేందుకు వేలాది మందిగా భక్తులు ఇప్పటికే తరలివెళ్ళారు. శివరాత్రి శనివారం అయినప్పటికీ శుక్రవారం నుండే భక్తుల తాకిడి విపరీతంగా పెరిగిపోయింది. పచ్చని దట్టమైన అభయారణ్యంలో కొలువు తీరిన లంకమల్లేశ్వరున్ని దర్శించుకునేందుకు దూర ప్రాంతాల నుండి భక్తులు తరలిరావడం విశేషం. లంకమల్లేశ్వరున్ని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతంగా భావించి అనేక ప్రాంతాల నుండి ట్రాక్టర్లలోను, లారీలలోనూ భక్తులు క్యూకట్టారు. ఇప్పటికే శివనామ స్మరణతో లంకమల్ల అభయారణ్యం మార్మోగుతోంది. శివ పార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగేందుకు తగు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు బారులు తీరారు. లంకమల్లేశ్వరుని సన్నిధిలో ఉన్న కోనేరులో స్నానమాచరించి, అక్కడి నుండి స్వామి వారిని దర్శించుకునేందుకు వెళుతారు. కొండ పై నుండి కోనేరులో జారే జలపాతాల మధ్య కనువిందు చేసే ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చని చెట్ల మధ్య చల్లటి వాతావరణంలో శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అక్కడక్కడా చలువ పందిర్లు, మంచినీరు లాంటి వసతులు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుండి తమ మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కోరిన కోర్కెలు తీరిన భక్తులు తమ భక్తిని చాటుకునేందుకు అన్నదాన కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. ఎక్కడ చూసినా భక్తులతో కిటకిటలాడే లంకమల్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకల ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. కేవలం శివరాత్రి, కార్తీక మాసాలలో మాత్రమే లంకమల్ల అభయారణ్యానికి భక్తులు వెళుతుంటారు. దట్టమైన అడవిలో పులులు సంచరించే ప్రాంతంలో లంకమల్లేశ్వరుడు కొలువు తీరిన నేపథ్యంలో వారిని దర్శించుకునేందకు భక్తులు ఎన్ని ప్రయాసలు పడినా శివనామ స్మరణతో ముందుకు సాగుతారు. కొత్త చెరువు నుండి దట్టమైన అడవి మార్గంలో పెద్ద గుండు రాళ్ళ మధ్యలో నుండి ప్రయాణించే ఈ పయనంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా పోలీసులు అక్కడక్కడా నిఘా ఏర్పాటు చేసి ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. రెవిన్యూ అధికారులు ఇప్పటికే ఆ ప్రాంతానికి వెళ్ళి తగిన ఏర్పాట్లు చేయడమే కాకుండా పోలీసులు, ఆరోగ్య శాఖ అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా ఒకటే రోడ్డు మార్గం ఉండడం వలన ఎక్కడ బస్సు ఆగినా లేక వాహనం ఆగినా ఇతర వాహనాలకు అంతరాయం కలగడమే కాకుండా ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు లేకపోలేదు. అంతే కాకుండా మార్గ మధ్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎత్తయిన చెట్లను కాకుండా చిన్న చిన్న కంప చెట్లను తొలగించి, ఒకవేళ మార్గ మధ్యలో వాహనాలు రిపేరు వస్తే పక్కకు జరిపేంత స్థలాన్ని సేకరించి అక్కడక్కడా పోలీసులు ఉండేలా ఏర్పాటు చేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి ఒక్కరూ లంకమల్లేశ్వరున్ని దర్శించుకొని తిరిగి గమ్య స్థానాలకు సురక్షితంగా చేరేలా ఏర్పాట్లు చేశారు. మరి కొంత మంది కాలి నడకన వచ్చే వారి కోసం అక్కడక్కడా ఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులను సిద్ధం చేశారు. ఆర్టీసి బస్సులు సిద్ధమయ్యాయి. ఇప్పటికే లంకమల్లకు చేరుకోవడం ప్రారంభమయ్యాయి. రెండు రోజులు నిరంతరాయంగా లంకమల్లేశ్వరున్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతున్న నేపథ్యంలో వాహనాలు, ఆర్టీసి బస్సులతో కిటకిటలాడే పరిస్థితి ఏర్పడుతున్న దృష్ట్యా పార్కింగ్ సౌకర్యం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి కొన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లు చేసి, అక్కడే వాహనాలు నిలిపి శైవ క్షేత్రానికి వెళ్ళే విధంగా సిద్ధం చేశారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడం వలన ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరిగినా ఇబ్బంది కలుగుతుందన్న నేపథ్యంలో పోలీసులు, రెవిన్యూ అధికారులు ఇతర శాఖల అధికారుల సహకారంతో మహా శివరాత్రికి లంకమల్లేశ్వరుని ప్రాంతంలో ఏర్పాట్లను ముందస్తుగా ఏర్పాటు చేశారు.

## ఆకస్మికంగా వార్డు సచివాలయం తనిఖీ

### -ప్రభుత్వ సేవలను ప్రజలకు నిర్దేశించిన సమయంలో అందించాలి

### -సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

### -సచివాలయం సిబ్బందిని ఆదేశించిన జిల్లా కలెక్టర్



రాయచోటి.ఫిబ్రవరి17 ప్రభాతవార్త

ప్రభుత్వ సేవలను ప్రజలకు నిర్దేశించిన సమయంలో అందించేలా సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ ఆదేశించారు. శుక్రవారం మద్యాహ్నం రాయచోటి పురపాలక సంఘం ఎస్ఎన్‌కాలనీ 14వ వార్డులోని వార్డు సచివాలయం 9ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను, సచివాలయ సిబ్బంది రిజిస్టర్‌లు, పలు రికార్డులను తనిఖీ చేశారు. టాక్స్ కలెక్ట్, ఆయుష్మాన్ భారత్, 90 డేష్ పట్టాస్, వాటర్ సప్లై, శానిటేషన్, ఇంటింటి చెత్త సేకరణ, పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, ఇంటింటికి చెత్త సేకరణ పక్కాగా జరగాలన్నారు. నవరత్నాలలో పేదలందరికి ఇళ్ల పథకం కింద జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలను అర్హులైన ప్రతి ఒక్క లబ్దిదారుడుకి అందించే విధంగా సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది నిరంతరం ప్రజలుకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. వారి వెంట రాయచోటి పురపాలక సంఘం కమీషనర్ రాంబాబు, వార్డు సచివాలయ సిబ్బంది కలరు.

**జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి**

**-అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్**

నవరత్నాలు పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఎంపిడివోలు, గృహ నిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సంబందిత అధికారులు అందరూ కృషి చేయాలన్నారు. ఇండ్ల నిర్మాణంలో ప్రతి వారం దశల వారిగా స్టేజ్ కన్వర్షన్ జరగాలని సూచించారు. జగనన్న హౌసింగ్ నిర్మాణాలలో పురోగతి సాధించాలని లేకపోతే చర్యలు తప్పవన్నారు. లబ్దిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ఒక్కో లబ్దిదారునికి 35 వేల రుణం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ పీడిని కలెక్టర్ ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరయిన పనులన్నీ గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలలో వేగం పెంచి గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు ఇంజనీర్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బిఎంసియు, నిర్మాణాలను యుద్ద ప్రాతిపదికన వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపివో ధనలక్ష్మి, హౌసింగ్ పిడి శివయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్నకుమార్, డిఆర్‌డిఏ పిడి సత్యనారాయణ, పిఆర్ ఎస్ఈ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## మహాశివరాత్రి మహోత్సవానికి సర్వం సిద్ధం



ఖాజీపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రాలలో నాగ నాథేశ్వర స్వామి ఆలయం ఒకటి కడపజిల్లా, ఖాజీపేట మండలం, పుల్లూరు పంచాయతీ పరిధిలో స్వయంభు లింగాకారుడి గా కొండపై వెలసినాడు .కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం గా భక్తులు భావిస్తుంటారు. అతి పురాతన మైన ఈ ఆలయాన్ని రావులపల్లె గ్రామానికి చెందిన కీ''శే లు గంగవరం రామిరెడ్డి పునరుద్ధరణ చేశారు. ఏటా మహా శివరాత్రి సందర్భంగా రాష్టం నలుమూలల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు 18వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా శ్రీ నాగ నాథేశ్వర స్వామి ఆలయం శివనామ స్మరణతో మారుమోగనుంది. పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చే భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ మాజీ చైర్మన్ గంగవరం ఆది నారాయణరెడ్డి తెలిపారు.

## ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా నిర్వహించాలి



కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:

ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై డీఆర్వో గంగాధర్ గౌడ్, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం, ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఈనెల 20 నుంచి మార్చి 7వ తేదీ వరకు జనరల్ కోర్సులకు ఈనెల 26 నుంచి మార్చి 7 వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అయా తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు రెండు పూటలా పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 72 కేంద్రాల్లో జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు, 19 కేంద్రాలలో ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఆయా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు, రెవెన్యూ అదికారులకు సూచించారు. పరీక్షలకు సంబంధించి ఆర్ఐవో కార్యాలయంలో ఒక కంట్రోల్ రూంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏదైనా సమాచారం కోసం 08562-244171 నెంబరుకు సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో పోలీసు, ఏపీఎస్ఆర్టీసీ విద్యుత్తు శాఖల అధికారులు పరీక్షల కమిటీ సభ్యులు ఎం.ప్రకాష్, సీవీ సుబ్రమణ్యం, బి.వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## 24 లక్షల రూపాయలు విలువ చేసే 109 మొబైల్ ఫోన్ల రికవరీ


### -ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



రాయచోటి, ఫిబ్రవరి17, ప్రభాతవార్త

జిల్లా పోలీస్ శాఖ ఆద్వర్యంలో రూపొందించిన మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ద్వారా 24 లక్షలు విలువైన 109 మొబైల్ ఫోన్‌ల రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 539 మొబైల్ మిస్సింగ్ కేసులో నమోదు కాగా ఎంఎంటిస్ ద్వారా 109 యాక్టివ్ మొబైల్స్ గుర్తించినట్లు చెప్పారు. త్వరలోనే మిగతా మొబైల్స్‌కూడా రికవరీ చేస్తామని చెప్పారు. పోలీస్ స్టేషన్ వెల్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు కాకుండా బాధితులకు పోగొట్టుకున్న తమ మొబైల్స్ అందించడమే మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం ముఖ్య లక్ష్యమన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడానికి 8688830012 నంబర్‌తో బాక్స్ సేవలు ప్రారంభించారు. తక్కువ సమయం లో రికవరీకి కృషి చేసిన టెక్నికల్ టీంను జిల్లా ఎస్పీ హర్ష వర్దన్‌రాజు అభినందించారు. అనతి కాలంలో మొబైల్ రిక వరీ చేసి తమకు అందజేయడంతో మొబైల్ బాధితులు హర్షం వ్యక్తం చేస్తు స్పీకి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ డిఎస్పీ శ్రీనివాసరాజు, రాయచోటి సబ్ డివిజనల్ డిఎస్పీ శ్రీధర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సత్య నారాయణ, టెక్నికల్

## మహాశివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు





చిట్వేలి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పుర స్కరించుకుని మండల పరిధిలోని శైవక్షేత్రాలు పచ్చని తోరణాలు, చలువ పందిళ్లు, దీప కాంతుల నడుమ దేదీప్యమానంగా ముస్తాబయ్యాయి. పాత చిట్వేలిలో వెలసిన ఉన్న భద్రకాళి సమేత శ్రీవీరభద్రేశ్వరస్వామి ఆలయం, శ్రీ శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, శ్రీరంగనాయకుల స్వామి దేవాలయంలో, నక్కపల్లెలో వెలసిన శివాలయాల్లో విశేష పూజలు జరుగుతాయని ఆలయ పెద్దలు తెలిపారు. కాగా శ్రీభద్రకాళి ఆలయం నందు ఉదయం రుద్రాభిషేకం, చండీయాగం, నాలుగు కాలాల పూజలు ఆదివారం స్వామి, అమ్మవార్ల కళ్యాణం, అన్నదానం జరుగుతాయని ఆలయ పెద్దలు పేర్కొన్నారు. కాగా శ్రీశ్యామలమ్మ సోమేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ఏకవార రుద్రాభిషేకం, అమ్మవారికి ముత్యాల అలంకరణ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం శివపార్వతుల కళ్యాణం, రాత్రికి లింగోద్భవ కార్యక్రమం జరుగుతుందని ఆలయ పెద్దలు పేర్కొన్నారు. కాగా చిట్వేలి మండలం పెద్దూరు నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఆహ్లాదకరమైన అటవీ ప్రాంతంలో కర్కటేశ్వరుని రూపంలో భక్తులకు దర్శనమిస్తూ గుండాల నుంచి వచ్చే జలపాతాలతో భక్తులకు ఆనందాన్ని పంచుతూ కర్కటేశ్వరుని రూపంలో ప్రత్యక్ష దర్శనభాగ్యాన్ని కలిగిస్తూ పిలిస్తే పలికే దేవునిగా పేరొందిన గుండాలేశ్వరుడు దేవాలయం దగ్గర అధికారులు ఆలయ పెద్దలు వేలాదిగా తరలివెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు జరగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పెద్దఎత్తున అన్నదానాలు నిర్వహించేందుకు భక్తులు పోటీ పడడం గుండాలకోనలో విశేషం. మండల పరిధిలోని అన్ని శైవక్షేత్రాలకు వేలాదిగా భక్తులు తరలిరావాలని, అందరూ ఆహ్వానితులేనని, ఎలాంటి తొందరపాటు లేకుండా దేవుని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను తీసుకోవాలని ఆలయ పెద్దలు కోరారు.

## దోపిడి రాజ్యం పోవాలి.... పేదోడి రాజ్యం రావాలి

### -ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి



రాయచోటి, ఫిబ్రవరి17 ప్రభాతవార్త

రాష్ట్రంలో దోపిడి రాజ్యం పోవాలి పేదవాడి రాజ్యం రావాలి అని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాయచోటి మండలం దూలవారిపల్లిలో శుక్రవారం రాష్ట్రానికి ఇదేమి కర్మ మరియు రచ్చబండ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్బంగా రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్‌టి రామారావు స్థాపించి పేదల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. పేదవాడి ఆకలి గుర్తించి రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని అలాగే ఆడపడుచులకు సమాన హక్కు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పది రూపాయలు ఇచ్చి 50 రూపాయలు దోచుకుంటుందని అలాగే రాష్ట్రంలో 45 రకాల పన్నుల వేసి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. వైసిపి పార్టీ గాలికి వచ్చిన పార్టీ గాలికే పోతుందని చలోక్తులు విసిరారు. ప్రజలంతా సైకోను ఇంటికి పంపించకపోతే మీరు ఫ్యాన్‌కు ఉరి వేసుకోవాల్సి వస్తుందని అన్నారు. ప్రజల నుంచి ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారు. వీరి నిధులు కూడా జగన్‌రెడ్డి దారి మళ్లించారు. పల్లెల్లో ఎక్కడ పనులు చేయడానికి నిధులు లేకపోవడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రజలకు సమాధానాలు చెప్పలేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నష్ట పరిహారం అందలేదని రైతు ఆత్మహత్యాయత్నం



రైతు బోడే జనార్దన్ ఫైల్ ఫొటో

నందలూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని నారాయణరాజుపేట గ్రామానికి చెందిన బోడే జనార్దన్ తనకు వారసత్వంగా వచ్చిన భూమి సర్వేనంబరు 1/1డి2, 1/1హెచ్3లో గల ఎకరా 28 సెంట్ల భూమి నేషనల్ హైవే వస్తుండడంతో తన భూమి ఆన్‌లైన్‌లో లేని కారణంగా తనకు పరిహారం రాదని చెప్పి అధికారులు భూమిని తీసుకుంటున్నారని, దీనిపై పలుమార్లు సంబంధించిన అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా వారు పట్టించుకొన్న దాఖలాలు లేవని, సన్నకారు రైతునని తనకు ఈ భూమి జీవనాధారం అని, పరిహారం రాలేదని మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన స్థానిక రైతులు అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా రైతు జనార్దన్ మాట్లాడుతూ తనకు, తన కుటుంబానికి ఈ పొలమే ఆధారమని, తనకు రావాల్సిన పరిహారాన్ని న్యాయబద్ధంగా ఇప్పించాలని లేనిపక్షంలో తాను, తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ముందు పురుగుల మందు తాగి చనిపోతామని తెలిపారు.

## దక్షిణకాశి హత్యరాల పుణ్యక్షేత్రం

### శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు- ప్రత్యక్ష దైవం గుండాలకోన

### అడవుల్లో కొలువుదీరిన వై.కోట గుండాలేశ్వరుడు



శివరాత్రికి ముస్తాబైన అత్తిరాల త్రేతేశ్వరస్వామి ఆలయం, అత్తిరాల కొండపై కొలువైన త్రేతేశ్వరస్వామి, కామాక్షిదేవి, ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి, చైర్మన్ సుబ్బారెడ్డి

రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రాలు శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అయ్యాయి. పవిత్ర పుణ్యక్షేత్రం హత్యరాలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన హత్యరాల పుణ్యక్షేత్రం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు అయ్యింది. బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇప్పటికే అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శుక్రవారం రాజంపేట డిఎస్‌పి శివభాస్కరెడ్డి, సిఐ పుల్లయ్య, ఎస్ఐ బత్సవత్సలంలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఛైర్మన్ వెలకచర్ల సుబ్బారెడ్డితో చర్చించారు. ఆలయం లోపల, వెలుపల బ్యారికేడింగ్ ఏర్పాటు చేశారు. హత్యరాల మడుగులో ఎవరు దిగకుండా జల్లుల ద్వారా స్నానం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. వివిధ సంస్థలు ఇప్పటికే అన్నదానం చేసేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశాయి. ఆలయ శిఖరాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆర్‌టిసి బస్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

### పంటల కొనుగోలు విధానంను

## పరిశీలించిన శిక్షణాకలెక్టర్

రాజుపాళెం,ఫిబ్రవరి17,ప్రభాతవార్త.

మండల పరిధిలోని చిన్నశెట్టిపల్లె గ్రామంలో శుక్రవారం పంటకొనుగోలు విధానం,గ్రామసచివాలయం పనితీరును శిక్షణాకలెక్టర్ ప్రశాత్‌కుమార్ పరిశీలించారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు విధానంలో అధికారులు చేపట్టు చర్యలు ఏలాగున్నాయని పరిశీలించుటకు గ్రామంలోని సచి వాయ అధికారులు చేపట్టిన పంటల నమోదు,దిగుబడి వారు గిట్టుబాటు ధరలకు అమ్ముకొనుటకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు.గ్రామసచివాలయ అధి కారులు పనితీరునుకూడా పరిశీలించారు.ఈకార్యక్రమంలో తాసిల్దార్ ఇంద్రాణి, మార్కుపెడ్ యండి,నరశింహ్మాహారెడ్డి, వ్యవసాయశాఖ అధికారి శివరామక్రిష్ణారెడ్డి, ఇంచార్జ్ ఆర్ఐ అశోక్, తదితరులు పాల్గోన్నారు.

## నాగినేని రమేష్‌కు ఆర్థిక సాయం

మైదుకూరు ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



మైదుకూరు మున్సి పాలిటీ పరిధిలోని 18వ వార్డులో నివసించే నాగినేని రమేష్ రమేష్ కు లక్ష్మీ మాధవరాయ స్వామి దేవస్థానం చైర్మన్ భూమిరెడ్డి సుబ్బరాయుడు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. మూడు నెలలుగా నరాల జబ్బుతో బాధపడుతూ మంచానికి పరిమితమై ఉన్నారు. అనంతరం వైస్సార్సీపీ పట్టణ కన్వీనర్ లింగన్న, శ్రీధర్, బండి తిరుమ లేష్, లాలయ్య, వెంకట సుబ్బయ్య, మహేష్. శంకర్ లు మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి త్వరలో రమేష్ ను పరామర్శించి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## మహాశివరాత్రి ఝురికోన ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి : సర్పంచి

కలకడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తః



తూపల్లి గ్రామం శ్రీశ్రీశ్రీ మహేశ్వర స్వామి ఆలయం ఝురికోన వద్ద తూపల్లె గ్రామ సర్పంచి పోతులూరి ఆనందరెడ్డి ఏర్పాట్లు అని న్న పూర్తి చేశామని అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18వ తేదీ శనివారం మహాశివరాత్రి పర్వదిన పండుగను పురస్కరించుకుని ఈ ఝురి కోనకు వచ్చే భక్తులకు ప్రజల కోసం అన్ని ఏర్పాట్లును సౌకర్యాలను పూర్తి చేశామని భక్తులు ప్రజలు తమ మొక్కులనుతీర్చుకుని స్వామివారిని దర్శించుకో వచ్చునన్నారు. ఝురికోన వద్ద ఉన్న మహేశ్వరస్వామి వారికి వెండిపడగలను ప్రధానం చేసిన సిబ్బాల, వెంకట రమణారెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, మునిస్వామిరెడ్డి, లోకనాధరెడ్డి, సదాశివరెడ్డి, నాగరాణి, దివ్య, కీర్తిజ్యోతి , వెంకటేశు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కేవి.పల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తః



మండలంలోని వగళ్ల కేజీబీవీ పాఠశాలలో ఆర్‌బీఐ ఆర్థిక సహకారంతో విఐడీఎస్ వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంటు సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎఫ్ఎల్ కౌన్సిలర్ సుధాకర్ మాట్లాడుతూ పిల్లలకు ఆర్థిక పొదుపు సామాజిక భద్రతల భీమాల గురించి వివరించారు. ఆన్‌లైన్ నగదు ఖాతాలు, కుటుంబ ఆదాయ వ్యయాలు, సైబర్ క్రైమ్ ప్రభుత్వం విద్యార్థు లకు అందిస్తున్న సుకన్య, సమద్ధి యోజన పథకం గురించి వివరించారు. ప్రభు త్వం అందిస్తున్న పథకాలుగురించి వివరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రావణి, శివ, భోదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా అక్కదేవతల విగ్రహ ప్రతిష్ట

కేవి.పల్లె , ఫిబ్రవరి 17 ప్రభాతవార్తః



మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లె సమీపంలో నిర్మిం చిన అక్కదేవతల ఆలయంలో శుక్రవారం విగ్రహాల ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా చింతమాకులపల్లె మల్లికార్జునరెడ్డి గహం నుంచి విగ్రహ ప్రతిష్టకు కావలసిన పూజా సామగ్రిని జడ్పీటీసీ గజ్జల శ్రుతి , వైకాపా మండల యూత్ కన్వీనర్ గజ్జల శీనురెడ్డి దంపతులు డప్పు, మంగళ వాయిద్యాలతో తీసుకు వచ్చారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిం చారు. ఆలయంలో గుర్రపుబొమ్మలకు పూజలు జరిపారు. అనంతరం దేవతల విగ్రహాలను ప్రతిష్టించి పూజలు జరిపారు. రాత్రి చెక్కభజనలు కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో చింతమాకులపల్లెవారి బందు వులు పాల్గొన్నారు. ఈడిగపల్లెలో వెలసిన గుర్రప్పస్వామిని గర్నిమిట్ట సురేష్‌శర్మ స్వామి వారికి పూజలు జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

## వింత జబ్బుతో చనిపోతున్న పందులు

కమలాపురం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలో ఎక్కడ చూసినా పందులు, కోతులు, కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. కాలనీల్లో సందు గొందుల్లో ఇళ్ల మధ్యలో, కాలువల్లో, రోడ్లపై ఉన్న మురికి నీటిలో పందులు స్వైర విహారం చేస్తూ అనారోగ్యంతో చచ్చిపోతున్న పందులను పంచాయతీ సిబ్బంది రోజుకు సుమారు 30 పందుల కళేబరాలను గుర్తిస్తూ తొలగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోని నగర కమిషనర్ పలుమార్లు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పందులను బహిష్కరించాలని కమిషనర్, సిబ్బందిని హెచ్చరించినా ఫలితం శూన్యం. ఇది ఇలా ఉండగా పలుదారుల్లో, వీధుల్లో కుక్కలు హడావుడి చేస్తున్నాయి. ఇంతేనా అనుకుంటే పప్పులో కాలు వేసినట్లు పట్టణంలో దోమల బెడద కూడా ఎక్కువ. మరో పక్క కోతులు విచ్చలవిడిగా దారిన పోయే వారిని బెదరగొడుతున్నాయి. ప్రజలు పలుమార్లు అధికారులకు చెప్పిఆ ఫలితం లేకపోగా కమిషనర్లు వస్తున్నారు, పోతున్నారు తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీలో పందులు, కోతులు, దోమల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## నాగన్నకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు

రామాపురం.ఫిబ్రవరి17 ప్రభాతవార్త



రామాపురం మండలంలోని నల్లగుట్ట పల్లి గ్రామం, బి.రాచపల్లికు చెందిన నాగన్న శు క్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక నాయకులు ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు రమేష్‌కుమార్‌రెడ్డి, గడికోట ద్వారకనాధరెడ్డి నాగన్న భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రమేష్‌కుమార్‌రెడ్డి నాగన్న కుటుంబానికి అండగా ఉంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ మార్కెట్ చైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలికోన్నత పాఠశాలకు వెన్నుదన్నుగా స్వచ్ఛంద సంస్థలు

గాలివీడు.ఫిబ్రవరి17 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు చదువులు, మౌళిక వసతులు కల్పనే ధ్యేయంగా స్వచ్ఛంద సంస్థలు ముందడుగు వేశాయి. అందులో భాగంగా బెంగళూరు వారి అపోటెక్స్, యునైటెడ్ వే, మనం సంస్థ సభ్యులు సహకారంతో గాలివీడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రూ.9.5 లక్షలతో ఏర్పాటు చేసిన స్టెమ్ ల్యాబ్ ఆర్‌వో ప్లాంట్, 13 కుళాయిలతో ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్‌ను ప్రధానోపాధ్యాయురాలు నిర్మల ఆధ్వర్యంలో ఆయా సంస్థల ప్రతినిధులు యోగాంజనేయ రెడ్డి, వైవిఎస్ ప్రకాష్, పద్మావతి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మ చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ వివిధ స్వచ్ఛంద సంస్థలు సేవా దృక్పదంతో నిధులను వెచ్చించి విద్యార్థులకు ఉపయోగకరమైన ఆధునిక సాంకేతిక సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సంధ్య, భూషణ్‌రెడ్డి, కాశీ విశ్వనాధరెడ్డి, శ్రీనివాసులు, ఆర్షద్ షేక్‌షా వలి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీశివకోటి మహాయజ్ఞం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తః



మండలంలోని మంచూరులో వెల సిన శ్రీఆంజినేయస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు పూజారి రామకష్ణ తలెఇపారు. భక్తులు ఆంజినేయ స్వామి దీక్షను స్వీకరించారన్నారు. నేడు శనివా రం ఉదయం 5గంటలకు శ్రీశివ కోటి మహాయజ్ఞం ప్రారంభమై మరుసటిరోజు 19వ తేదీ ఆదివారం ఉద యం 5గంటలకు శివకోటి మహాయజ్ఞం కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. 19వ తేదీ ఉదయం పుష్పపల్లకిపై శ్రీసీతారాములవారు అధిరోహించి గ్రామంలో ఊరేగింపు, శ్రీరామ సంకీర్తనలు, చెక్కభజనలు కార్య క్రమాలు జరుగుతాయన్నారు. మహాశివరాత్రి 7గంటలకు శివపార్వతుల కళ్యా ణం, రాత్రి 10గంటలకు అగ్నిగుండ ప్రవేశం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఉర్దూ సేవలను విస్తతం చేయండి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తః



పీలేరు నియోజకవర్గంలో ముస్లీం మైనారిటీ ఉపాధ్యాయులు, విద్యార్తులు అధికంగా ఉన్న దష్టా ఉర్దూ అకాడమీ సేవలను విస్తృతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్, సెక్రటరీ ఆయుబ్‌హుస్సేన్ అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం వాల్మీకిపురం ఉర్దూ అకాడమికి విచ్చేశారు. అనంతరం ఆయుబ్ ఎమ్మెల్యే స్వగృహంకు వెళ్లి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయుబ్‌కు శాలువ కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన పీలేరులో మైనారిటీలు అధికంగా ఉన్న దష్ట్యా ఉర్దూ అకాడమి గ్రంథాలయాన్ని కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలో 35వేలు మంది మైనారిటీలు ఉన్నందు వల్ల ఉర్దూ అకాడమి సేవలను విస్తతం చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయుబ్ పీలేరులో ఉర్దూ అకాడమి కార్యక్రమాలను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు అబ్దుల్ కలీం, రిజ్వానుల్లా, చికెన్ మస్తాన్, సైఫుల్లా, గంగయ్య, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్శిటీ క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తః



ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని వాల్మీకిపురం క్రికెట్ సబ్ సెంటర్లలో శిక్షణ పొందే ఏడుగురు క్రికెట్ క్రీడాకారులు క్రికెట్లలో విశేష ప్రతిభ చూపి నగరాల్లోని వివిధ యూనివర్శిటీ క్రికెట్ జట్లకు ఎంపికైనట్లు సబ్ సెంటర్ కోచ్ సునీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎసీ ్వ యూనివర్శిటీకి కె.దీపన్‌సాయి(స్పిన్‌బౌలర్), ఎస్.ఫయాజ్ (మిడిల్‌ఆర్డర్ బ్యాటర్), ఎస్.ఆకీబ్(ఓపెనింగ్ బ్యాటర్'), ఎస్.సౌజిద్ (మీడియం ఫేస్). భవాని ప్రసాద్ (ఓపెనింగ్ బ్యాటర్)లు ఎంపికైయ్యారన్నారు. జేఎన్‌టీయూ యూనివర్శిటీకి వై.మల్లేశాన్(మీడియంఫేస్), విట్ వేలూరు యూనివర్శిటీకి, పి.కార్తీక్,(మిడిల్ ఆర్డర్ బ్యాటర్)లు ఎంపికైయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి మార్చి 4వ తేదీ వరకు బెంగుళూరు రేవా యూనివర్శిటీ మీట్లో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ మీట్లో ఈక్రీడాకారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. విద్యార్తులు ఎంపిక పట్ల జీవీఎస్సీ ఎస్ అండర్ వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ ఫౌండర్ శ్రీధర్ సీనియర్ క్రీడా కారులు ఖాదర్‌బాషా, షాహిద్, భరత్, పఠాన్, రామకష్ణ, ముజీఆర్, మరియు క్యాంప్ క్రీడాకారులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

## పంచ శివలింగ దివ్యదర్శనం

కమలాపురం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



మహా శివరాత్రి పండగ సందర్భంగా ఓం శాంతి వారి ఆధ్వర్యంలో వివిధ రకాల శివలింగాల ప్రతిమలతో భక్తజనకోటి పరమ శివుని దర్శన భాగ్యం కలిగిస్తూ కమలాపురం పట్టణం రైల్వే గేటు వద్ద ఉన్న శ్రీకృష్ణ మందిరంలో 17, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అవుతుంది. భక్తులందరూ విచ్చేసి ఆ పరమశివుని దర్శనం చేసుకోవాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## గంగమ్మ జాతరకు కలెక్టర్, ఎస్పీకి ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



ఈనెల 21, 22 తేదీల్లో జరగనున్న గంగమ్మ జాతరకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పీఎస్, ఎస్పీ హర్షవర్ధన్ రాజులను కలిసి గంగమ్మ జాతర ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆలయ కమిటీ ఛైర్మన్ సామల నరసింహారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి రవీంద్ర రాజులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా రెండు లక్షల మంది భక్తులు గంగమ్మ జాతరకు తరలి వస్తారని రెండు రోజుల పాటు జాతర అత్యంత వైభవంగా జరుగుతుందని ఈ జాతరకు కుటుంబ సభ్యులతో రావాలని వారు కలెక్టర్, ఎస్పీలను ఆహ్వానించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కోటపల్లె నందు డ్రైనేజీ పనుల పరిశీలన

పీలేరు, ఫిబ్రవరి 17

ప్రభాతవార్తః



స్తానిక కోటపల్లె నందు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాధరెడ్డి, సర్పం చి డాక్టర్ హబీబ్‌బాషా ఆధ్వర్యంలో డ్రైనేజీ కాలువలను పరిశుభ్రం చేయించి అనంతరం వీధిలైట్లు ఏర్పాటుచేశారు. కోటపల్లె బాలుర పాఠశాల వరకు పైపులైను ఏర్పాటును పరిశీలించారు. అనంతరం ఏపీఐఐసీ నందు ఇళ్ల స్థలాలను పరిశీ లించి రాళ్లు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ బ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



జన వికాస్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఎండీ తాహిర్ జన్మదినోత్స వాన్ని పురస్కరించుకొని కడప నగరంలో పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బృహ దా బ్లడ్ బ్యాంక్ నందు ఉచిత రక్తదాన శిబిరాన్ని ఖూన్‌కా రిస్తా ఆధ్వర్యంలో అలాగే మూగ చెవిటి వసతి గృహం అనాథ పిల్లల వసతి గృహంలో అన్ని ఆశ్రమాల్లో అల్పాహార కార్యక్రమం, నిరాశ్రయుల వసతి గృహంలో చాంద్ బీ ట్రస్ట్ అధినేత మన్సూర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, మొక్కలు నాటే కార్యక్రమం, మానసిక వికలాంగుల కేంద్రాలలో అన్ని ఆశ్రమాలలో అల్పాహార పంపిణీ కార్యక్రమం, పండ్ల పంపిణీ కార్యక్రమం, వస్త్ర ధారణ కార్యక్రమం, అన్నదాన కార్యక్రమాలు, నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాలు ఘనంగా నిర్వమించారు. యువత తాహిర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు ముఖ్య అతిథులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీవవీ రమణ, అలీషేర్, మన్సూర్ అలీఖాన్, నూనె నాగేష్, జనవికాస్ ప్రతినిధులు సీఎస్ నాసిర్ అలీ, అబ్దుల్ వాజిద్, షేక్ మస్తాన్ వల్లీ, ఇషాక్‌బాషా, హిందుస్థాన్ సాదిక్ అలీఖాన్, నరసింహా, స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేష్, ఖూన్‌కా రిస్తా అధ్యక్షులు తారిఖ్ అలీ, పలు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పార్వతీ పరమేశ్వరుల కళ్యాణోత్సవం

ప్రొద్దుటూరు అర్బన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

18. 2. 23 శనివారం మహాశివరాత్రి పర్వదిన శుభ సందర్భంగా అమ్మవారిశాలలోని శ్రీ పార్వతీ సమేత నగరేశ్వర స్వామి కళ్యాణోత్సవం జరుగుతున్నట్లు ఆర్యవైశ్య సభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవము సాయం కాలం ఐదు గంటలకు నిర్వహించబడునని తదుపరి రాత్రి 9 గంటలకు శ్రీ నగరేశ్వర స్వామి వారికి ప్రీతికరంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం మరియు శ్రీ పార్వతీ దేవికి సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించబడును కావున ఈ కార్యక్రమము యందు భక్తాదులందరూ పాల్గొనవలసినదిగా ఆర్యవైశ్య సభ వారి విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యార్థులకు దుస్తులు పంపిణీ

పోరుమామిళ్ల రూరల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



పోరుమామిళ్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలైన టేకూరుపేట, కవలకుంట్లలలో చదువుతున్న బాల బాలికలు 643 మందికి స్థానిక ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్. గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతులు శుక్రవారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధులు ఎల్. ప్రసాద్రెడ్డి, జి. శ్రీకాంత్ రెడ్డి గారు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లా డుతూ గత 20 సంవత్సరాలుగా ఎఫ్. సి. ఎన్. ద్వారా చేసే సేవలను వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్యాంకు ఖాతాలో డబ్బు మాయం : సిఐ

### ఆందోళనలో ఖాతాదారులు

పోరుమామిళ్ల రూరల్ ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



పోరుమామిళ్ల పట్టణంలో బ్యాంకుల ఖాతాల్లో మాయమైన డబ్బులకు దిక్కెవరు మహాప్రభు అని సిపిఐ మండల కార్యదర్శి రవి కుమార్, పట్టణ కార్యదర్శి పిడుగు మస్తాన్ లు శుక్రవారం విలేకర్ల సమావేశంలో బ్యాంకు అధికారులపై మండిపడ్డారు. తిరుపతి రెడ్డి కాలనీ లో సిపిఐ నాయకులు మాట్లాడుతూ వందకు వంద, పోగు చేసుకొని బ్యాంకులో డబ్బులు కూడా పెట్టుకుందామనుకుంటే ఆ డబ్బులకి రక్షణ లేని పరిస్థితుల్లో బ్యాంకు సిబ్బంది ఉన్నారన్నారు. గతంలో రంగసముద్రం స్టేట్ బ్యాంకు ఉద్యోగి ప్రజల బంగారాన్ని , దొంగతనం చేసి, ఆ బంగారంతో జల్సాలు చేసినప్పటికీ, అతనిపై కేసు నమోదు చేసే తప్ప, పూర్తిస్థాయిలో ప్రజలకు బంగారాన్ని రికవరీ చేయలేని పరిస్థితి, నేడు స్టేట్ బ్యాంక్, గ్రామీణ బ్యాంక్, ఆంధ్ర బ్యాంక్, వైశ్యా బ్యాంక్ లలో ప్రజల ఖాతాల్లో నుండి ఎంత డబ్బులు ఎవరి ఖాతాలో మాయం అయిందో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. నష్టపోయిన ప్రతి ఖాతాదారుడికి తిరిగి వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అన్ని బ్యాంకు ల్లో కలిసి 56 లక్షలు మాయమైనట్లు తెలుస్తుంది అలాగే ఆర్మీ ఉద్యో గుల ఖాతాల్లో నుండి అధిక సంఖ్యలో డబ్బులు మాయమైనట్లు తెలుస్తున్నది. ప్రతి ఒక్క ఖాతాదారుడికి తిరిగి చెల్లించకపోతే బ్యాంకు ఎదుట దీక్షలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కేశవ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రమణ, చెన్నయ్య పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం : ఎస్‌పి

కడప క్రైం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:

రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో పక్కాగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. కార్లు, జీపులు నడిపే వారు సీటు బెల్టు తప్పని సరిగా ధరించాలని తెలిపారు. వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఓవర్ లోడింగ్‌తో వెళ్లే ఆటోలపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు భద్రతపై స్టిక్కర్లు, పోస్టర్లు ముద్రించి పట్టణాలతో పాటు గ్రామాల్లో అతికిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను, ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదం జరగకుండా చూడాలన్నారు. జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబం దనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం కేసులు 65 నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన చోదకులపై 55 కేసులు, సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు, ఇతర వాహనాల చోదకులు 10 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు.

## ఉపాధ్యాయులపై పని భారం తగ్గించాలి : ఒంటేరు

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

పాఠశాలల్లో లిప్ (అభ్యసన అభివృద్ధి కార్యక్రమం) పరీక్షల నిర్వహణ, వివిధ రకాల మూల్యాంకాల నిర్వహణ వంటి పని భారాలను ఉపాధ్యాయుల పై నుండి తప్పించాలని ఒంటేరు శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిత్యం వివిధ రకాల కార్యక్రమాలు రూపొందిస్తూ ఉపాధ్యాయులనం తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోందని చెప్పారు. ఇప్పటికే బోధనేతర పనుల వల్ల ఉపాధ్యాయులు తరగతి గదిలో పాఠ్యాంశాల బోధన సక్రమంగా నిర్వహించలేక పోతున్నారని చెప్పారు. ఒకవైపు సిలబస్ పూర్తి చేయాలంటూ ఒత్తిడి తెస్తూ మరోవైపు లిప్ కార్యక్రమాన్ని నిర్వహించి మూల్యాంకాలు చేయాలని తీవ్ర ఒత్తిడికి గురిచేయడం భావ్యం కాదన్నారు. ప్రస్తుతం ఉన్న తరగతుల బోధన వాటి సిలబస్ పూర్తి చేయుటకే ఉపాధ్యాయులకు సమయం సరిపోదని , వీటికి తోడు సరికొత్త కార్యక్రమాలు అదనంగా వారిపై రుద్దితే వారు ఎలా విధులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఒత్తిడి లేని వాతావరణంలో అభ్యసన ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు

మైదుకూరు ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



మైదుకూరు మండల పరిధిలోని ఎరువుల షాపులను బద్వేలి వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం నాగ రాజు ఆకస్మిక తనిఖీ చేశారు.మైదుకూరు మండల కేంద్రంలో మూడు షాపులు నంద్యాలంపేటలో మూడు షాపుల చొప్పున మొత్తం ఆరు షాపులలో తనిఖీ చేసి స్టాక్ రిజిస్టరు, బిల్స్, ఇన్ వాయిస్ లైసెన్సులు వాటి కాల పరిమితి స్టాక్ బోర్డు ధరల బోర్డు, ఈపాస్ మిషన్, గోడాన్స్ ను తనిఖీ చేసి పలు సూచనలు చేయడం జరిగింది. లైసెన్సులను దుకాణంలో రైతులు చూసేలా అతికించాలని. ఆదికృత సంస్థల నుండి మాత్రమే ఎరువులను కొనుగోలు చేయాలని. రైతులు కొన్న ఎరువులకు తప్పనిసరిగా రసీదు ఇచ్చి వారి పూర్తి వివరాలు ఆధార్, మొబైల్ నెంబరు, గ్రామము, మండలము వంటి వివరాలను నమోదు చేయాలని అన్నారు. డీలర్లకు కొన్ని ఉత్పత్తులకు స్టాక్ సేల్ నోటీసులు ఇవ్వడం జరిగిందని అన్నారు. రైతులు నిబంధన మేరకు వ్యాపార లావాదేవీలు నిర్వహించాలని గరిష్ట అమ్మక ధర కంటే ఎక్కువ ధరకు అమ్మ రాదని నాణ్యమైన ఎరువలను మాత్రమే అమ్మాలని సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు మండల వ్యవసాయ అధికారి లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న సత్యప్పను పరామర్శించిన టిడిపి నాయకుడు రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం.ఫిబ్రవరి17 ప్రభాతవార్త



మండలంలోని దిగువగొట్టివీడు గ్రామంలో టిడిపి కార్యకర్త పుల్లగూర సత్యప్ప అనారోగ్యంతో బాధపడుతు న్నాడని తెలుసుకుని శుక్రవారం రాయచోటి టిడిపి నియోజకవర్గ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## స్థలం కొనుగోలుకు ఎంపి విరాళం

గుర్రంకొండ, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



గుర్రంకొండలోని 7వ వార్డులోని ఉర్దూ యూపి పాఠశాల భవన నిర్మాణానికి లక్షన్నర రూపాయలను శుక్రవారం ఎంపి వెంకట మిధున్‌రెడ్డి విరాళంగా చెక్కు ఇచ్చినట్లు ఎంపిటిసి ఖధీర్ తెలిపారు. పాఠశాల లేక 7వ వార్డు ఉర్దూ విద్యార్థులు స్థలం లేక చాలా ఇబ్బందులు పడుతున్న తరుణంలో స్థలం కోసం లక్షన్నర రూపాయాలను ఎంపి ఇచ్చారన్నారు. గుర్రంకొండ సర్పంచ్ ఈ సమస్యను ఎంపి దృష్టికి తీసుకు పోవడంతో ఈ సమస్యను పరిష్కరించారు. ఈ చెక్కును పాఠశాల ఛైర్మన్ అల్తాఫ్ మరియు ప్రధాన ఉపాధ్యాయునికి గుర్రంకొండ సర్పంచ్ జమీర్‌అలీఖాన్, ఎంపిటిసి ఖధీర్, నాయిని శివశంకర్‌లు చెక్కు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విధ్యార్థుల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు ఎంపి మిదున్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## ఉర్దూ లైబ్రరీని సందర్శించిన డైరెక్టర్ ఆయూబ్‌హుస్సేన్

గుర్రంకొండ, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



గుర్రంకొండలోని ఉర్దూ లైబ్రరీని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ ఆయూబ్ హుస్సేన్ శుక్రవారం సందర్శించారు. లైబ్రరీకి సంభందించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపిటిసి ఖధీర్ మాట్లా డుతూ ఉర్దూ లైబ్రరీలో కంప్యూటర్‌లు లేవని, లైబ్రరీకి పుస్తకాలు కూడా కొత్తవి పంపిం చాలని కోరారు. విద్యార్థులు రోజూ లైబ్రరీకి వెళ్ళాలని సూచించారు. అనంతరం ఉర్దూ పాఠశాలలో బహుమతులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో లైబ్రరీ మెంబర్ హిదయతుల్లాహుస్సేన్, విశ్రాంత లక్చరర్ షఫివుల్లా ఖాన్, కన్వీనర్ కుసుమ, ఉర్దూ హైస్కూల్ ఛైర్మన్ సైదుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రామాలయ నిర్మాణానికి భూమి పూజ

మైదుకూరు ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



మైదుకూరు మండ లం తిప్పిరెడ్డిపల్లి గ్రామ పంచా యతీలోని టీ.కొత్తపల్లిలో పురాతనమైన రామాలయము స్థానములో నూతన రామాలయ నిర్మాణం కొరకు టి. కొత్తపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ బండి నాగేంద్ర ఆధ్వర్యంలో భూమి పూజ జరిగింది.ఈ సందర్భంగా బండి నాగేంద్ర మాట్లాడుతూ పాత రామాలయం స్థానంలో కొత్త రామా లయం నిర్మించుట కొరకు దేవాదాయ శాఖ వారు 31 లక్ష రూపాయలు శాంక్షన్ అయిందని.ఈ సందర్భంగా శుక్రవారం కొత్తపల్లి సర్పంచ్ బండి నాగేంద్ర చేతుల మీదుగా నూతన దేవాలయమునకు భూమి పూజ చేశారు. కార్య క్రమంలో గుడి నిర్మాణ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## వైఎస్.కొండారెడ్డి కేసును కొట్టివేత

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:

చక్రాయపేట మండల వైసీపీ ఇన్‌ఛార్జి వై.ఎస్.కొండారెడ్డి కేసును శుక్రవారం లక్కిరెడ్డిపల్లె కోర్టులో కేసును కొట్టివేసినట్లు కోరట్టు వర్గాలు తెలిపాయి. గత ఏడాది మే నెల 9వ తేదీన ఎస్.ఆర్.కె.కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్టర్‌ను బెదిరించారన్న ఆరోపణలపై చక్రాయపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదై 14 రోజులు రిమాండ్ ఇధించారు. లక్కిరెడ్డిపల్లె కోర్టులో శుక్రవారం జరిగిన విచారణలో సరైన సాక్షాధారాలు లేని కారణంగా కేసు కొట్టివేసినట్లు కోర్టు వర్గాలు తెలిపారు.

## గుండాలకోనలో భారీగా భక్త జనం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం వై.కోట అటవీ ప్రాంతంలో వెలసిన గుండాలేశ్వరునికి దర్శించుకునేందుకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భారీగా భక్తులు తరలి వెళ్లారు. జిల్లా అధికారులు ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఏటా రాజంపేట, రైల్వేకోడూరు నుంచి బస్సులు ఏర్పాటు చేయడం జరుగుతోంది. అలాగే ఈ ఏడాది కూడా బస్సు సౌకర్యం, జనరేటర్లు, ఛార్జి బ్యాటరీల సాయంతో దేవాలయం అత్యంత సుందరంగా తీర్చిదిద్దబడింది. ఎన్నో సంవత్సరాలుగా గుండాలేశ్వరుని దర్శించుకుంటే శుభాలు కలుగుతాయని భక్తులు ప్రగాఢ నమ్మకం. జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి భక్తులు రావడం విశేషం.

## మహాశివరాత్రి పండుగకు సర్వం సిద్ధం

### నేడు శివాలయాల్లో వైభవంగా పూజలు

**మదనపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



మహాశివరాత్రి పండగకు శివాలయాలన్నీ ముస్తాబు అయ్యాయి. శనివారం మహాశివరాత్రిని పురస్కరించుకొని మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాల్లోని శివాలయాలను పచ్చటి తోరణాలు, విద్యుద్ దీపాలతో అలంకరించారుర. భక్తుల కు సౌకర్యార్థంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివపార్వతులను దర్శించుకునే భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించనున్నారు. పట్టణంలోని మడి కయ్యల శివాలయం(యోగబోగేశ్వరస్వామి ఆలయం), సోమేశ్వర స్వామి ఆల యం, శ్రీమంజునాథ్‌స్వామి ఆలయం, వేంపల్లి మల్లయ్యకొండ, సిటిఎంలోని శివాలయం, నిమ్మనపల్లెలోని శ్రీనేలమల్లేశ్వరస్వామి ఆలయం, రామసముద్రంలోని శ్రీ వాలేశ్వరస్వామి ఆలయం, తంబళ్లపల్లెమండలం మల్లయ్యకొండపై వెలిసి యున్న శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, అంగళ్ళు సమీపంలోని మల్లి కార్జునస్వామి ఆలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా వైభంగా పూజలు నిర్వహించనున్నారు. ఆలయ కమిటి నిర్వాహకులు, గ్రామ పెద్దలు, అర్చకులు ఏర్పాట్లు ముమ్మరంగా చేశారు. మదనపల్లె ఆర్టీసి వన్‌డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం డిపో మేనేజర్ ఎంవి.రమణారెడ్డి బస్సులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని శ్రీయోగబోగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైభంగా ధ్వజారోహణం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## నేడు, రేపు మదనపల్లెలో ఇస్తిమా

### పరిశీలించిన ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, శ్రీకాంత్‌రెడ్డి

**మదనపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



మదనపల్లెలో 18, 19వ తేదీల్లో ఇస్తిమా వైభవంగా జరగనున్నది. శుక్ర వారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా, శ్రీకాంత్ రెడ్డి ఇస్తిమా ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ రెండు రోజులు పాటు మదనపల్లెలోని టిప్పుసుల్తాన్ మైదానంలో అత్యంత పవిత్రంగా భక్తిశ్రద్దలతో జరిగే ఇస్తిమా కార్య క్రమానికి సుమారు రెండులక్షల మంది ముస్లిం సోదరులు రానున్నట్లు తెలిపారు. దైవభక్తి, క్రమశిక్షణ, శ్రమతో ఏర్పాట్లు చేయడంతో పాటు ఆరోగ్య విషయాలు, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు, కొరత లేకుండా సమన్వయంతో కార్యక్రమాలు చేస్తుండడం హర్షదాయకమన్నారు. ప్రపంచ మానవాళికి శాంతి కలగాలని ఇస్తిమాలో పాల్గొనే ప్రతి ఒక్కరికి అల్లాదేవుని కరుణా కటాక్షాలు ఉండాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మదనపల్లె హబీబుల్లాఖాన్, మహమ్మద్‌ఖాన్, జాకీర్, గౌస్‌ఖాన్, రియాజ్, నిస్సార్‌లు పాల్గొన్నారు.

## 19న బిటి కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

**మదనపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



బిటి కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు గంగారపు రాందాస్ చౌదరి తెలిపారు. శుక్ర వారం బెంగుళూరు రోడ్డులోని టిఎన్.అభిరామిరెడ్డి తోపులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 25సంవత్సరాలుగా మదనపల్లె బిటి కళాశాల పూర్వవిద్యార్థుల సమావేశాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం జరిగే పూర్వ విద్యార్థుల సమావేశానికి పూర్వ విద్యార్థులు అందరూ హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. బిటి కళాశాలను ప్రభుత్వ పరం చేయడంలో ఎంపి మిథున్ రెడ్డి చేసిన కృషి అబినందనీయమన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ మదు సూదన్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, బోర్‌వెల్ సుధాకర్, రెడ్డిసుబ్రమణ్యం పాల్గొన్నారు.

## ఎగువ భద్ర ప్రాజెక్టును వెంటనే ఆపాలి

### జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణప్ప

**మదనపల్లె, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



రాయలసీమను ఎడారిగా మార్చే ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణ పనులను వెంటనే ఆపాలని రాష్ట్ర రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణప్ప తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం రూ.5, 300కోట్లు ప్రకటించడాన్ని నిలిపివేయాలన్నారు. ఆ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి అయితే రాయలసీమ ఎడారిగా మారుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా పనిచేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రోజులు దగ్గర పడుతున్నాయన్నారు.

## విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

**మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



ఒంటరి జీవితం భరించలేక జీవితం మీద విరక్తి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ సంఘటన గురువారం రాత్రి మొలకల చెరువు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు మండలం లోని పర్తికోటకు చెందిన గాలేజి విజయకుమార్(54) కూలి పనులు చేస్తుండే వాడు. వివాహమైన కొద్ది రోజులకే భార్య రామలక్ష్మి అలిగి పుట్టిం టికి వెళ్ళిపోయింది. అప్పటి నుంచి ఆమె తిరిగి రాకపోవడంతో భర్త ఒంటరిగానే మిగిలిపోయాడు. దీంతో ఒంటరి జీవితం భరించలేక గురువారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యకుయత్నించాడు. గమనించిన స్థానికులు 108లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భార్యపై భర్త దాడి

**మదనపల్లెక్రైం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



భార్యపై భర్త దాడి చేసి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మదనపల్లె రూరల్‌లో గురువారం రాత్రి జరిగింది. పోలీసుల మేరకు వేంపల్లి పంచాయితీ బండకిందపల్లెకు చెందిన సుజాత కూలి చేసుకొని జీవనం సాగి స్తొంది. ఆమె భర్త భాస్కర్ కూలిపనులు చేస్తాడు. వీరికి ఇంజనీరింగ్ చదివే కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా భాస్కర్ ఇదే గ్రామానికి చెందిన ఓ మహిళ విషయమై గొడవ పెట్టుకొని తనను వేదింపుకు గురిచేస్తున్నాడని ఆమె ఆరోపించారు. పలుసార్లు గొడవలు జరిగినా పెద్దమనుష్యులు సర్ది చెప్పారు. గురు వారం రాత్రి భాస్కర్ తన భార్య సుజాతను విచక్షణా రహితంగా కొట్టి ఇంట్లో నుంచి గెంటేశాడు. భర్తదాడిలో గాయపడిన సుజాతను గ్రామస్తులు 108లో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్సలు పొందు తోంది. రూరల్ పోలీసులు కేసు విచారిస్తున్నారు.

## వాలీబాల్ జట్టులో చెంబకూరు విద్యార్థి ప్రతిభ

**రామసముద్రం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



రామసముద్రం మండలంలోని చెంబ కూరు పంచాయితీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి పవన్ కుమార్ అండర్-14వాలీబాల్ జట్టులో ప్రతిభ చూపాడు. ఈనెల 14నుంచి 16 వరకు గుంటూరుజిల్లా నరసా రావు పేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపడంతో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు విష్ణుప్రియ, పీడి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

## మహిమాన్వితుడు అఖండ మల్లేశ్వరుడు

**కురబలకోట, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



మహాశివరాత్రికి మండలంలోని అంగళ్ళు గ్రామం మల్లయ్యకొండలో వెలసిన శ్రీ అఖండ మల్లేశ్వరస్వామి ఉత్సవా లను నిర్వహించేందుకు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఆలయ ఛైర్మెన్ కాకర్ల క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లను చేస్తున్నారు. ఈశాన్యంలో కాకర్లకోన, మల్లేశ్వర ప్రాజెక్టు, వాయువ్యంలో నిమ్మకాయల కోన, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీ జిడ్డుక్రిష్ణమూర్తి రుషివ్యాలీస్కూల్, నైరుతిలో ఊటుకోన, ఆగ్నేయంలో అక్కగార్లకోన వంటి వివేషాలతో ఆహ్లాదకరమైన వాతా వరణంలో ఈ ఆలయ విశిష్టతగా చాటి చెప్పుతోంది. ప్రతిఏట జరిగే మహాశివ రాత్రి ఉత్స వాలను ఏటేటా రెట్టింపు చేస్తూ ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంతో దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహయ సహకారాలు అందిస్తు న్నారు. మల్లయ్యకొండలో ఇప్పటికే కమ్యూనిటి హాలు, వాటర్‌ట్యాంకు, ఆలయం ఎదుట రంగనాథ మండపం, అఖండ మల్లేశ్వరుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగులతో సుందరంగా దీర్చి దిద్దారు. నూతన విద్యుత్ దీపాలంకరణ చేశారు. భక్తుల కోసం మంచినీరు, చలవ పందిళ్ళను ఏర్పాటు చేశారు. ఉత్స వాల్లో భాగంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు, హరికథాకాలక్షేపాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఛైర్మెన్ తెలిపారు. శివరాత్రికి అంగళ్ల నుంచి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఆర్టీసి బస్సులను నడపునున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద గోపూజతో ప్రారంభమై గంగా, గణపతి, రుద్రాభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తా మన్నారు. అదేరోజు రాత్రి భక్తుల జాగరణ కోసం హరికథా, మౌనిక భరతనాట్యం, దేవరెద్దులు, కోలాటాలు, పిళ్ళనగ్రోవిలతో అలరింపచేయనున్నట్లు తెలిపారు. అన్నదానకార్యక్రమాలు ఉంటాయన్నారు. బ్రహ్మముహూర్తం నందు దీపస్థంభంపై భారీ కర్పూర హారతి, ప్రత్యేక తీర్థప్రసాదాలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

**పెద్ద తిప్ప సముద్రం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన పిటీఎం గ్రామంలో స్థానికంగా వెలి సిన శ్రీ పార్వతి సమేత వీరూపాక్షేశ్వర ఆలయంలో ఈనెల 18వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలు అంగరంగ వైభవంగా ప్రతి ఏడాది జరిగే ఈ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్తులకు కన్నుల పండుగ గా నిర్వహణ ఘనంగా ఏర్పాట్లు నిర్వహించనున్నట్లు. ఆలయ నిర్వహకులు సనగరం పట్టాభి రామయ్య తెలిపారు. అత్యంత వైభవంగా ఆలయంలో జరిగే బ్రహ్మో త్సవాలను పురస్కరించుకొని తెలుగు సాంప్రదాయాల ప్రకారం వేద పండితుల చే ఈనెల 18 తేదీ రోజున అంకురార్పణ. కలసశ స్థాపన. ధ్వజారోహణం. పంచామృతభి షేకం. శనేశ్వరునికి తైలాభిషేకం. మహ మంగళహారతి. శివుని విగ్రహానికి పాలాభిషేకం. 19వ తేదీన ఏకవార రుద్రాభిషేకం గణపతి హెూమం. నవగ్రహ హెూమం. రుద్ర హెూమం. శివపార్వతుల కళ్యాణోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యక్షంగా రాతితో తయారు చేసిన శివుని విగ్రహం 45 రూ వేల విలువైన గల శివుని విగ్రహానికి బ్రహ్మోత్సవాల భాగంగా పాలాభిషేకం నిర్వహణకు బి.కొత్తకోట పట్టణానికి చెందిన ఆకుల మల్లికార్జున వితరణ చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభి రామయ్య తెలిపారు.20న రథోత్సవం కార్యక్రమం భక్తుల సమక్షంలో వైభవంగా కొనసాగుతుందని మండలంలోని చుట్టుపక్కల గ్రామాలతో పాటు వివిధ మండలాల నుంచి అధిక సంఖ్యలో ఈ కార్య క్రమానికి హాజరవుతారని ఆలయానికి చేరిన భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వహకులు తెలిపారు.

## 45 రోజులకు కువైట్ నుంచి సగినాల జ్యోతి భౌతిక కాయం

**కడప కార్పొరేషన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



జీవనోపాధి కోసం వైఎస్ ఆర్ జిల్లాకు చెందిన సగినాల జ్యోతి 3 సంవత్సరాల క్రితం కువైట్‌లో ఇంటి పనులు నిమిత్తం వెళ్లింది. అక్కడ పనులు ఎక్కువై ఇంటి నుంచి పారిపోయింది. బయట పనులు చేసు కుంటూ అనారోగ్యం భారిన పడి జనవరి 3వ తేదీన సగినాల జ్యోతి మరణిం చిందని ఏపీ ఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ ఇలియాస్ పేర్కొన్నారు. ఆమె బంధువులు విజ్ఞప్తి మేరకు జడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి విషయాన్ని ఏపీ ఎన్ఆర్టీఎస్ అధ్యక్షులు వెంకట్ ఎస్.మేడపాటికి విషయం చేరవేశారు. కువైట్ ఇమిగ్రేషన్ అధికారులు పొరపాటున జ్యోతి శ్రీలంక దేశస్తురాలుగా ఆకామా నమోదు చేయ డంతో భౌతిక కాయానాన్ని ఇండియాకు తెచ్చేందుకు ఇబ్బంది ఏర్పడింది. కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, కువైట్ ఏపీ ఎన్ఆర్టీఈఎస్ రీజనల్ కోఆర్డినేటర్‌లు జాఫర్ అలీ, గోవింద్ నాగరాజులు రాయభార కార్యాలయం అధికారులతో మాట్లా డారు. కువైట్ ఇమిగ్రేషన్, పోలీసు అధికారులతో చర్చించడంతో జ్యోతి భారతీయ దేశస్తురాలిగానే నమోదు చేసుకున్నారు. అవసరమైన పేపర్ పనులను పూర్తి చేశారు. భారత రాయబార కార్యాలయం సహకారంతో జ్యోతి భౌతిక కాయాన్ని 46 రోజులకు 17వ తేదీ శుక్ర వారం చెన్నై విమానాశ్రయానికి చేర్చారు. అక్కడి నుంచి ఏపీఎన్ఆర్టీఎస్ ఉచిత అంబులెన్స్‌లో ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లె హరిజనవాడకు తరలించారు.

## ఆర్టీసీ బస్టాండ్ల ప్రైవేటీకరణను ప్రతిఘటిస్తాం

**జమ్మలమడుగు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా ఆర్టీసీ బస్టాండ్లను ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు లీజు ప్రాతిపదికన కట్టబెట్టే చర్యలను ప్రతిఘటిస్తామని సీపీఎం జమ్మల మడుగు కార్యదర్శి శివనారాయణ తీవ్రంగా హెచ్చరించారు. శుక్ర వారం జమ్మలమడుగు ఎన్జీవో హోంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్లను లీజు పేరుతో 33 సంవత్సరాల పాటు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలనే ఆలోచించడం సరైంది కాదన్నారు. రాష్ట్ర సీఎం ఆర్టీసీ ఛైర్మన్ ఇద్దరూ కడప జిల్లా వాసులే అయినా వీరిద్దరూ లీజు పేరుతో ఆర్టీసీ బస్టాండ్ల ప్రైవేటీకరణ నిలుపుదల చేసేలా చూడాలన్నారు. బస్టాండ్ల నిర్వహణకు ఆర్టీసీ సామర్థ్యం కలిగి ఉందని ఆ సామ ర్థ్యాన్ని వినియోగించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండ య్య, శ్రీను పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**దువ్వూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై దువ్వూరు ఏపీజీబీ వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో బ్యాంకు మేనేజర్ శ్రావన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పొదుపు, ప్రాముఖ్యత, ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీల నిర్వహణ వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం కళాజాత బృందం మ్యాజిక్ షో ప్రదర్శించడంతో విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో క్షేత్రాధికారి రామాంజనేయ, పాఠశాల హెచ్ఎం అహల్యాబాయి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిడిపి సమన్వయ కమిటీ సమావేశం

**కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు మల్లెం లింగారెడ్డి అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసురెడ్డి, ఎమ్మెల్సీలు బీటెక్ రవి, శివనాథ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాయచోటి ఇన్‌ఛార్జి రమేష్‌కుమార్‌రెడ్డి, బద్వేలు బాధ్యులు రితేష్‌కుమార్‌రెడ్డి, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ అభ్యర్థి భూమిరెడ్డి రామ గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, బచ్చల పుల్లయ్య, ముక్తియార్, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మాజీ టీటీడీ బోర్డు సభ్యులు ప్రసాద్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి హాజరయ్యారు.

## మౌలానా అబుల్ కలాం పాకెట్ క్యాలెండర్ విడుదల

**కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



మన భారతదేశానికి తొలి విద్యాశాఖా మంత్రిగా సేవలు అందించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని ప్రముఖ కంటి వైద్యులు డా.ఎస్ఎం ఆషీఫ్ అన్నారు. ఆర్ఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఆజాద్ ఫొటోతో చిన్న సైజు ప్యాకెట్ క్యాలెండర్‌ను డా.ఆసీఫ్ విడుదల చేశారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి, యువత ఆజాద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ముందుకు నడవాలని అన్నారు.

## సమాజ భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి

### ఉప కులపతి ఆచార్య జింక రంగ జనార్ధన్

**వైవీయూ ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**

ప్రజలు చైతన్యవంతులై సమాజ అభివృద్ధిలో భాగస్వాములైనప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జింక రంగ జనార్ధన్ ఉద్ఘాటించారు. "సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో యువత భాగస్వామ్యం "అనే అంశంపై జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్స్ కి ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ మూడు రోజుల శిక్షణా తరగతుల ముగింపు సభకు ముఖ్య అతిథిగా ఉపకులపతి ఆచార్య రంగ జనార్ధన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యము వసతి. సురక్షిత నీరు, విద్య అందుకున్నప్పుడే అభివృద్ధి మొదలవుతుందన్నారు. ప్రభుత్వాల అందించే పథకాలను అందుకునేంత చైతన్యం గ్రామీణ ప్రజల్లో కల్పించాలన్నారు. కుల సచివులు ఆచార్య వైపి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ శిక్షణ ఫలాలు క్షేత్రస్థాయికి చేర్చాలని పిఓలకు సూచించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త డాక్టర్ నరాల వెంకట్రామిరెడ్డి, ఢిల్లీ నుంచి ప్రవా స్వచ్ఛంద సంస్థ ప్రత్యేక ప్రతినిధిగా హాజరైన ఇషానిషేన్ , నవ్య రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల శిక్షణ అర్థవంతంగా సాగిందని తెలిపారు. అనంతరం అతిధుల చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు ప్రజల గౌరవాన్ని పెంచుతా : ఎమ్మెల్యే

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు నియోజక వర్గ ప్రజలు తనపై ఎంతో విశ్వాసంతో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఈ స్థానాన్ని కల్పించాలని అలాంటి ప్రొద్దుటూరు ప్రజలకు ఊపిరి ఉన్నంతవరకు చెడ్డ పేరు తెచ్చే పనులు చేయనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం చైర్పర్సన్ సాంబార్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ వర్గాల కోసం కాదని కేవలం తనపై విశ్వాసం ఉంచిన ప్రజల కోసం ఈ పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశానన్నారు. తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల మనసులకు అనుగుణంగా సేవ చేస్తానే తప్ప ఎలాంటి చెడ్డ పేరు తెచ్చే పనులు చేయనన్నారు. ప్రజా జీవితంలో ఉంటున్న తాను వ్యసనాలను త్యజించి అనునిత్యం ప్రజాసేవకే అంకితమయ్యానన్నారు. తనపై అసత్య ఆరోపణలతో చేస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాబోవు ఎన్నికలలో మరో మారు టిడిపికి ప్రజలే బుద్ధి చెబుతారని జోష్యం చెప్పారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీముని పల్లి లక్ష్మీదేవి నాగరాజు వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి కౌన్సిలర్లు వరికూటి ఓబులరెడ్డి భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్త మల్లేశ్వరికి నియామక పత్రం ఇవ్వాలి

**కడప వైద్యవిభాగం, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఆశా వర్కర్ల నియామకంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని అప్లికేషన్ గడువు ముగిసిన తరువాత వచ్చిన దరఖాస్తులు తీసుకున్న అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్‌గా ఎంపికైన మల్లేశ్వరి నియామక పత్రం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వైఎస్ఆర్ ప్రెస్‌క్లబ్‌లో బాధ్యత మల్లేశ్వరితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐ టీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణు గోపాల్, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాకార్యకర్తల నియామానికి దరఖాస్తు సమర్పించే చివరిరోజున ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లె గ్రామం ఆశా కార్య కర్తగా గురిగింజకుంట మల్లేశ్వరి దరఖాస్తు చేసుకోగా అప్పటికి ఒక్క దరఖాస్తే వచ్చిందనీ, నువ్వే ఎంపికయ్యావని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారులు చెప్పారన్నారు. ఎంపిక చేసిన లిస్టును జిల్లా వైద్య శాఖాధికారులు కలెక్టర్‌కు అప్రూవల్‌కు పంపిన తరువాత పీహెచ్‌సీ వవైద్యాధికారులు కూడా కలెక్టర్ అప్రూ వల్ చేసిన ఫైనలిస్టును పంపి మల్లేశ్వరికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని ఆదేశించి మల్లేశ్వరికి పీహెచ్‌సీ అధికారులు నువ్వు ఆశా వర్కర్‌గా సెలెక్ట్ అయ్యా యని నియామక పత్రం తీసుకోవడానికి రేపు రమ్మని చెప్పి ఇప్పుడు మల్లేశ్వరికి తప్ప మిగతా వారికి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధీనంలో జరిగే ప్రతి ఉద్యోగ నియామకాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి అక్రమాలకు అవినీతికి అద్దు అదుపు లేకుండా పోతుందని వాటిపైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## అనారోగ్యంతో సగళా వెంకటరమణయ్య మృతి

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**



బంగారు వ్యాపారి సగళా వెంకట రమణయ్య (75) శుక్రవారం అనా రోగ్యంతో మృతిచెందారు. వివరాలలోకి వెళితే సగళా వెంకట రమణయ్య గత 2 నెలలుగా అనారోగ్యంతో పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. మృతుడు సగళా వెంకట రమణయ్యకు సగళా గోవిందు స్వామి, రాజా, సురేష్ బాబు (దినేష్ గార్మెంట్స్) ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె కల రు. విషయం తెలుసుకున్న ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బా రావు, సీనియర్ న్యాయవాది పి.వి.ఎన్.ప్రసాద్, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ సాయి కృష్ణ, వైసీపీ నాయకులు, అడా ఛైర్మెన్ సింగసాని గురుమోహన్, మున్సి పల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, 34వ వార్డు ఇన్‌ఛార్జ్ అనిల్ కుమార్ రాజు, 33వ వార్డు ఇన్‌ఛార్జ్ రామన బోయిన శ్రీనివాసులు యాదవ్, బిజ్జం రమణ, సిం గసాని శివయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, శ్రీ సత్యనారా యణ ఐరన్ అండ్ హార్డ్‌వేర్స్ దరిశి సుబ్రమణ్యం, గుబ్బా రామకృష్ణ, తులసి వెం కట శివనారాయణ, పత్తి నరసింహ, చిన్ని శ్రీనివాసులు, వల్లంకొండు వీర, సగ ళా సుబ్బరాయుడుతో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంచిత నానికి మారుపేరుగా నిలిచిన సగళా వెంకట రమణయ్య మృతిచెందడం బాధా కరం అని, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని వారు ఆకాంక్షించారు.

## కెఒఆర్ఎం ఎంబిఎ వారి ఆగమన్ 23

**కడప ఫిబ్రవరి 17, ప్రభాతవార్త**



కందుల ఓబుల్ రెడ్డి మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎమ్ బి ఎ విద్యార్థులు ఫ్రేషర్స్ డే నీ ఆగమన్ 23 అన్న పేరుతో ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం ఎమ్ బి ఎ విద్యార్థులను ఆహ్వానిస్తూ చివరి సంవత్సరం విద్యార్థులు జరిపిన ఈ కార్యక్రమం లో కళాశాల సెక్రెటరీ లిఖిత రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు మంచి నడవడికతో ఉత్తమ మేనేజర్లు గా ఎదగాలని సెక్రెటరీ లిఖిత రెడ్డి తెలిపారు. తరువాత విద్యార్థులు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. యాడ్ గేమ్, బి క్విజ్, కబాడి, వాలీ బాల్, షతిల్, యంగ్ మేనేజర్ లాంటి కార్యక్రమం నిర్వహించారు. ఆట పాటల తో సందడి చేశారు. యాడ్ గేమ్ విజేతలుగా పావని, దీప్తి, బి క్విజ్ విజేతలుగా మల్లిక, భార్గవి, అమ్మాయిల కబడి విజేతలుగా దీప్తి టీమ్, బాయ్స్ వాలీ బాల్ విజేతలుగా మణికంఠ టీమ్, షేటిల్ విజేతలుగా అనిల్ రెడ్డి, గౌస్ అహ్మద్, యంగ్ మేనేజర్ గా గంగి రెడ్డి లను ప్రకటించారు. విజేతలకు సెక్రెటరీ లిఖిత రెడ్డి, ఆచార్యులు లావణ్య, మల్లికార్జున, శరీన్ బహుమతులు అందజేశారు

## టోల్‌గేట్ల వద్ద ప్రజల తోలు ఒలుస్తున్న కంపెనీలు

### - పట్టించుకోని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

**కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



రాష్ట్రంలోని ముఖ్యమైన రోడ్లపై ప్రతి 50 కి.మీ ఒక టోల్ గేట్‌ను నిర్వహి స్తున్న చిన్నకారు నుంచి భారీ వాహనాల వరకు ఫీజులు, ఫైన్లు అంటూ దండు కున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పలు అనుమానా లకు దారి తీస్తుందని డీసీసీ మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్ అన్నారు. కడప నుంచి విజయవాడ వెళ్లాలంటే టోల్‌గేట్‌కు కనీసం రూ.600 చెల్లించాలి. గతంలో అయితే ఒక వాహనం వెళ్తే రూ.50 తీసుకునేవారు. తిరిగి వస్తే రూ.50 అదే ఒకే సారి రూ.75 చెల్లిస్తే రానుపోను సరిపోయేది కానీ ఇప్పుడు పరిస్థితి మారిం ది. ఫాస్ట్‌గేట్ ఉంటే టోల్‌గేట్ వద్ద వాహనాన్ని నిలపరు. రూ.50 అకౌంట్ నుంచి కట్ అవుతుంది. ఫాస్ట్ ట్యాగ్ లేకపోయినా ఫాస్ట్ ట్యాగ్‌లో డబ్బు లేకపోయినా రూ.50 అదనంగా రూ.50 ఫైన్ కలిపి రూ.100 క్యాష్ చెల్లిం చాలి. ఇది ఎక్కడి న్యాయం? ఫైన్ వేసే దానికి టోల్ గేట్ వారికి అధికారం ఎవరి చ్చారు? ఫాస్ట్‌ట్యాగ్ తీసుకొని దానిలో రూ.2వేలు జమ చేసి నెలకు ఒక సారి రెండు సార్లు తిరిగి రూ.50, నూరో అకౌంట్లో కట్ అవుతుంది. మిగతా రూ.1900 కంపెనీ అకౌంట్‌లో ఉంటుంది. ఎన్నో లక్షల రూపాయలు కంపెనీ అకౌంట్‌లో నిల్వ ఉంటాయి. అది కూడా కంపెనీకి లాభమే కదా ఎటు చూసినా వాహనదారుడు నష్టపోతున్నాడు. రోజు కొన్ని వేల చిన్న పెద్ద వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోజుకు కొన్ని లక్షల రూపాయలు టోల్ గేటు నిర్వాహ కులు దోచుకుంటున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదన్నారు.

## హజరత్ రకీబ్ షావలీ దర్గా స్థల వివాదం

### పలువురు అరెస్టు, స్టేషన్‌కు తరలింపు

**కడప ఏడురోడ్లు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:**



స్థానిక మోచంపేటలో ఎన్నో శతా బ్దాలుగా వెలసిఉన్న హజరత్ రకీబ్ షా వలీ దర్గాకు చెందిన 5 ఎకరాల 75 సెంట్ల స్థల వివాదంలో శుక్రవారం పలు మత గురువులను ముస్లిం ప్రజలను, ఇన్సాఫ్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి కడప పోలీసు డివిజన్‌లోని పలు స్టేషన్లకు తరలిం చారు. శుక్రవారం పలు మత గురువులను ముస్లిం ప్రజలను, ఇన్సాఫ్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి తరలించారు. శుక్రవారం స్థానిక రఖీబ్ షావలీ దర్గా మైదానంలో నమాజు తరువాత అధికార పార్టీకి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు గుమికూడారనే విషయం వైరల్ అవడంతో నగరంలోని అనేక మసీదుల నుంచి నమాజ్ అనంతరం మత గురువులు, ముస్లిం ప్రజలు తరలివెళ్లారు. అప్పటికే అక్కడ మోహరించి ఉన్న పోలీసులు వారిని అరెస్టు చేసి కడప పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్లకు వాహనాల్లో తరలించారు. మత గురువులు, ముస్లిం ప్రజానీకం తాము దర్గా వద్ద వైసీపీ ముస్లిం నాయకులు చేరుకున్నారని అక్కడ ఏమి జరుగుతున్నదని తెలుసుకోవడం వచ్చామని అనవసరంగా పోలీసులు తమను దౌర్జన్యంగా అరెస్టు చేసి ఎక్కడి కంటే అక్కడికి తరలించి భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమన్నారు.

## క్యాన్సర్, టీబి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదు

### కడప మేత్రాసన సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో చీరెలు పంపిణీ



క్యాన్సర్, టీబి వ్యాధిగ్రస్తులకు చీరెలు వితరణ చేస్తున్న దృశ్యం.

**బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :**

కడప మేత్రాసనం సాంఘీక సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ తలారి బాలరాజు ఆధ్వర్యంలో శుక్రవారం మైదుకూరు రోడ్‌లోని మదర్ థెరిస్సా చర్చీ ఫాదర్ ఆరోగ్యరాజు ఆధ్వర్యంలో క్యాన్సర్, టీబి వ్యాధిగ్రస్తులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐర్లాండ్ దేశస్థురాలు డబ్లిన్ ఆన్ క్యారల్ మాట్లాడుతూ క్యాన్సర్, టీబి వ్యాధులు అంటువ్యాధులు కావని, ఈ వ్యాధులు ఉన్న వారితో ప్రేమ, అనురాగాలు కలిగి ఉన్నపుడు వారు మనో ధైర్యంతో ఎదుర్కోగలరన్నారు. ఈ వ్యాధులు మరొకరికి వ్యాపించే వ్యాధులు కావని, సమాజంలో క్యాన్సర్, టీబి వ్యాధిగ్రస్తులు ఉన్నపుడు వారిని కూడా అందరిలాగే చూడాలన్నారు. అనంతరం టీబి, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను వారు ప్రేమానురాగాలతో పలకరించి వారికి అండగా ఉంటామని వారి ప్రాంతీయ భాషలో మాట్లాడిన మాటలను ఫాదర్ బాలరాజు తెలుగులో వివరించారు. అనంతరం మేత్రాసనం సాంఘీక సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ తలారి బాలరాజు హాజరై మాట్లాడుతూ ఐర్లాండ్ దేశస్థురాలు ఆన్ క్యారల్ సహకారంతో బద్వేలు ప్రాంతంలో చింతలచెరువు గ్రామంలో త్రాగునీరు, సాగునీరు సమస్య వలన ఇబ్బంది పడుతుండగా సుమారు 12 బోర్లు వేయించామని, అలాగే 10 కుటుంబాలకు పక్కా గృహాల నిర్మాణం చేపట్టామని, అలాగే పంగావాండ్లపల్లె, సిరిగిరిపల్లెతో పాటు బద్వేలులోని కొన్ని ప్రాంతాలలో నీటి సమస్య ఉన్న ప్రాంతాలలో ప్రత్యేక బోర్లు వేయించి ప్రజలకు నీటి సమస్య లేకుండా చూడగలిగామన్నారు. ఐర్లాండ్ దేశంలో ఉన్న వారు మన ప్రాంతంలోని ప్రజల సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేయడం వారి సేవలు అభినందనీయం అన్నారు. కడప మేత్రాసన సాంఘీక సేవా సంస్థ ద్వారా అనేక మందికి ఉపాధి కల్పించే విధంగా కుట్టు శిక్షణ, మొబైల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్‌తో పాటు పలు రకాల పనులను నేర్పించేందుకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇప్పించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా తమ సాంఘీక సేవా సంస్థ ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా క్యాన్సర్, టీబి వ్యాధిగ్రస్తులు ఎవరైనా ఎక్కడైనా ఉంటే ప్రాథమిక దశలో తమ దృష్టికి తీసుకువస్తే ఆ వ్యాధుల నివారణకు అవసరమైన ఆర్థికంగా వారికి చేయూతనిచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఎటువంటి అపోహలకు గురికాకుండా మనో ధైర్యంగా ఉంటూ ఆరోగ్య సూత్రాలు పాటించడం వలన సాధారణ స్థితికి చేరుకోగలుగుతారని సూచించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారిని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బందితో పాటు పలువురు ఫాదర్లు, మదర్ థెరిస్సా చర్చీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రికార్డుల నిర్వహణపై పర్యవేక్షణ ముమ్మరం



పీలేరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్తః

ప్రజా ఆరోగ్య విభాగంలో వివిధ ఆరోగ్య సేవల నమోదు అన్ని సేవలు, సరిగయు సమయంలో నిర్వహణ ప్రాముఖ్యత అన్ని స్థాయి అధికారులు గుర్తించాలని అన్నమయ్య జిల్లా కుటుంబ సంక్షేమ ప్రధాన గణాంక అధికారి ఓబుల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఓబుల్‌రెడ్డి వారి సహాయక బందంతో ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ నాగవేణి వారి ఆధ్వర్యంలో అన్ని ఆరోగ్య సేవల నమోదు రికార్డులను తగు అంశాలను పరిశీలించారు. జననాలు, మరణాలు, ఆసుపత్రికి రోజువారి సేవల నిమిత్తం వచ్చే వ్యాధి గ్రస్తులు, అవసరమగు అడ్మిషన్లు, శస్త్రచికిత్సల వివరాలు, వ్యాధి నిర్ధారణ కొరకు నమోదు కాబడ్డ రోగుల వివరాలు, మాతాశిశు సేవల్లోగర్భిణి సేవలు, ప్రసవాలు, కుటుంబ నియంత్రణ శాశ్వత, తాత్కాలికసేవలు వ్యాధి నిరోధక టీకాలు సేవలు నమోదు, లోటుపాట్లు సవరణలురికార్డు వారిగా నిశితంగా పరిశీలించి అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గణాంకాధికారి ఓబుల్‌రెడ్డి, కరీముల్లా, రాజేష్, శివారెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



దువ్వూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:

జిల్లాలో శనగ పంట రైతులు ఎవరూ తమ పంటను ప్రభుత్వ శనగ పంట సేకరణ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని దళారులను ఆశ్రయించవద్దని రాష్ట్ర వ్యవసాయ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పూర్తిగా రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర సీఎం ఆదేశాల మేరకు జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, ముద్దనూరు, కొండాపురం, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, రాజుపాళెం, దువ్వూరు, చాపాడు ప్రాంతాల్లో ప్రభుత్వ సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి తద్వారా నాణ్యతా ప్రమాణాల మేరకు క్వింటాళ్లకు రూ.5335 ధర చెల్లిస్తుందన్నారు. శనగ కొనుగోలు చేసిన తరువాత వాటికి చెందిన డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులు ఎవరూ దళారులను ఆశ్రయించి అమ్మరాదని అలాగే తమ పేరుతో దళారులు శనగ పంట అమ్ముటకు, నిల్వ చేసుకునేందుకు సహకరించరాదన్నారు. దళారులు శనగ పంటకు ఇచ్చే ధర కంటే ప్రభుత్వం అధిక ధర ఇస్తుందన్నారు. ఎవరైనా దళారులు మభ్యపెట్టి అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. శనగ, ధాన్యం సేకరణ విషయాలపై రైతులు సంబంధించిన మండల వ్యవసాయాధికారులను, రెవెన్యూ, మార్క్‌ఫెడ్ అధికారులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## గురుకుల బాలికల పాఠశాల, హాస్టల్ తనిఖీ

కడప లీగల్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



కడప పట్టణం చిన్నచౌకులో ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల హాస్టల్‌ను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ కవిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధి కార సంస్థ బాలల సంరక్షణ కొరకు స్నేహ పూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. పిల్లలు సత్‌ప్రవర్తనతో విద్యను అభ్యసించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మధ్యాహ్న సమయంలో వారికి అందుతున్న భోజన సదుపాయాలను పరిశీలించారు. రిజిస్టర్‌లను పరిశీలించారు విద్యార్థుల ఆరోగ్య విషయం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛంద సేవా సంస్థ వారి సహకారంతో పిల్లలకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో రామాలయ ధర్మకర్త వెంకట్‌రెడ్డి, బాసట స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బాలాజీ, వార్డెన్, ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పొలతలకు తరలిన భక్తులు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త:



మండలంలోని గంగనపల్లె పంచాయతీలో వెలసిన శ్రీ పొలతల మల్లేశ్వర స్వామి శుక్రవారం శంభో శంకరా అంటూ భక్తులు వాహనాలు పొలతల క్షేత్రానికి తరలి వెళ్లారు. మల్లేశ్వర స్వామి, అక్కదేవతలను, బండెన్నను దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. అక్కదేవతల గుడి వద్ద మహిళలు వర పడి మొక్కులు తీర్చుకున్నారు.

### మల్లేశ్వరునికి దర్శించుకున్న జిల్లా ఎస్పీ

మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శుక్రవారం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ మల్లేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పండితులు ఎస్పీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పొలతల క్షేత్రంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ముఖ్యంగా మహిళలు, చిన్నారులు కోనేర్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పొలతల క్షేత్రంలోని కాశినాయన ఆశ్రమంలో భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కాశీనాయన ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రెట్టింపు దిగుబడి : ఏవో నాగమణి



రామాపురం.ఫిబ్రవరి17

ప్రభాతవార్త

ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా సాధారణ దిగుబడి కన్నా రెట్టింపు దిగుబడిని పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి నాగమణి అన్నారు. మండలంలో నల్లగుట్టపల్లి గ్రామం కొత్తపల్లికి చెందిన చిల్లా లక్ష్మయ్య, పుష్పవతి వేసిన వర్షాధార ఆముదం పంటను శుక్రవారం ఆమె పరిశీలించారు. సాధారణంగా ఆముదం పంట ఒక హెక్టారుకు పది క్వింటాళ్ల దిగుబడి వస్తుందని కాని లక్ష్మయ్య వేసిన ఆముదం పంట వర్షాధార పంట అయిన పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అవలంబించి పండించడంతో హెక్టారుకు 25 క్వింటాళ్ల దిగుబడి లభించిందన్నారు. ఈ ఆముదం పంటను చూసేందుకు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు వచ్చి పంటను పరిశీలించి లక్ష్మయ్య అవంబించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులును అడిగి తెలుసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిని అవంబిస్తే పంట దిగుబడిని ప్రతి ఒక్క రైతు సాధించవచ్చని ఆమె రైతులుకు తెలిపారు. ఈ పంట పూర్తిగా రసాయనాలు లేకుండా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఘన జీవామృతం ద్రవ జీవామృతాలతో పండించినట్లు ఆమె తెలిపారు. రసాయనాలు వాడకుండా కషాయాలు వాడి రెట్టింపు దిగుబడిని సాధించడం ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. జీవవైవిద్యం పెంచుతూ తేడా లేకుండా ఈ పంట పండించడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో నాగమణి, ప్రకృతి వ్యవసా ట్రైనర్ మధుకర్, వెంకటరమణ, ఎంసీపీ వెంకట్రామిరెడ్డి, ఐసిఆర్‌పి శ్రీదేవి, లక్ష్మయ్య, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

## డిపిఆర్‌వోగా ఎంపికైన నోషిత



రాయచోటి.ఫిబ్రవరి17 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గురువారం ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో మద్దిరేవుల నోషిత డిపిఆర్‌వోగా ఎంపికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు ఖాళీలు ఉండగా ఏపిపిఎస్సీ గత సంవత్సరం నవంబర్6, 7 తేదీలలో పరీక్షలు నిర్వహించారు. నోషితా ఎంఎ పిహెచ్‌డి చదివారు. లక్కిరెడ్డిపల్లి మండలం, మద్దిరేవుల, రెడ్డివారిపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు విశ్వనాధరెడ్డి కుమార్తె నోషిత. ఈమె భర్త సబ్ ఇన్స్పెక్టర్‌గా హైదరాబాదులో విధులు నిర్వహిస్తున్నారు.

## పార్టీ ముసుగులో ప్రచారాలు చేయడం ఆర్జేడీకి తగదు

**- ఆర్జేడీని ప్రశ్నించిన సీపీఐ నాయకులు**
**- ధర్నాకు దిగిన సీపీఐ నాయకుల అరెస్టు**
**- విలేకర్లపై దుర్భాషలాడిన ఆర్జేడీ**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి, ధర్నాకు దిగిన సీపీఐ నాయకులు

పులివెందుల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :

పశ్చిమ రాయలసీమ టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆర్జేడీగా పనిచేస్తున్న ప్రతాప్‌రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైకాపా అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారాలు చేయడం ఏమిటని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. అనంతపురం జిల్లాలో గురువారం రాత్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రచారం చేస్తున్నారంటూ ఎస్ఎఫ్ఐ, సీపీఐ, తదితర కార్యకర్తలు ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డిని ముట్టడించడం వంటి సంఘటనలు జరిగిన విషయం తెలిసిందే. శుక్రవారం పులివెందులలో కూడా అధికార పర్యటన గురించి ముందస్తు సమాచారం లేకుండానే పులివెందులలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి పులివెందులలోని ఉపాధ్యాయులతో కలిసి పరీక్ష ప్రణాళికలపై చర్చిస్తున్నామంటూ సమావేశం జరుపుతుండగా విషయం తెలుసుకున్న సీపీఐ నాయకులు మురళి, వెంకటరాములు అక్కడికి చేరుకుని పులివెందులలో ముందస్తు సమాచారం లేకుండా సమావేశం ఏమిటని ప్రశ్నించగా.. అనుమతి లేకుండా సమావేశంలోకి ఎలా వస్తారంటూ ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి అక్కడికి వచ్చిన సీపీఐ నాయకులను ప్రశ్నించగా వారు అక్కడే ధర్నాకు దిగారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు అక్కడికి వచ్చి ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపురంలోని విలేకర్లు తెలివితక్కువగా ఇష్టం వచ్చినట్లు రాశారంటూ అసభ్య పదజాలాన్ని ఉపయోగించడంతో పులివెందుల సమావేశంలో ఉన్న విలేకర్లు అలా మాట్లాడటం సభ్యత కాదని.. అనంతపురం జిల్లా విలేకర్లను దూషిస్తున్నారు మరో చోట మమ్మల్ని కూడా దూషించరని గ్యారెంటీ ఏమిటని, వెంటనే క్షమాపణ చెప్పాలంటూ నిరసన వ్యక్తం చేశారు. అంతలో స్థానిక వైకాపా నాయకులు అక్కడికి చేరుకుని సమస్యను సద్దుమణిచి ఆర్జేడీని పులివెందుల నుండి పంపించి వేశారు. ఏదేమైనప్పటికీ విలేకర్లను ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి దూషించడం తగదని పలువురు హితవు పలికారు. అధికార పార్టీపై ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డికి అభిమానం ఉన్నా దానిని అధికారం అడ్డుపెట్టుకుని ప్రదర్శించడం తగదని సీపీఐ నాయకులు అన్నారు.

## ఇండోర్‌ను తలపించేలా పులివెందులను నిలుపుతాం

**- మున్సిపల్ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్**



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ వరప్రసాద్, వైస్‌ఛైర్మన్ హాఫీజ్

పులివెందుల, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :

దేశంలోనే స్వచ్ఛతలో ప్రథమస్థానంలో ఉన్న ఇండోర్‌ను తలపించేలా పులివెందుల మున్సిపాలిటీని కూడా తీర్చిదిద్దుతామని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైస్‌ఛైర్మన్ హాఫీజ్‌లు అన్నారు. పులివెందుల మున్సిపల్ కార్యాలయం నందు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిలర్లతో కలిసి వారు మాట్లాడారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 13 నుండి 15వ తేదీ వరకు కౌన్సిలర్లతో కలిసి ఇండోర్‌లో పర్యటించామని తెలిపారు. ఇండోర్‌కు చేరిన వెంటనే అక్కడ జరుగుతున్నటువంటి స్వచ్ఛతపై చర్యలను కిందిస్థాయి నుండి పైస్థాయి వరకు అధికారులతో, రాజకీయ పార్టీల నాయకులతో చర్చించడం జరిగిందని, అక్కడ తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి ఎరువులు, గ్యాస్, తదితర వాటిని తయారు చేసే విధానాన్ని తెలుసుకున్నామని తెలిపారు. ఇండోర్‌లో ఎక్కడ చూసినా పరిశుభ్రంగానే ఉందని, వారు తీసుకుంటున్న చర్యలపై చర్చించామన్నారు. 2016కు ముందు ఇండోర్ కూడా మన పులివెందులలాగే ఉండేదని, ఆ తరువాత అక్కడ మేయర్‌గా ఎన్నికైన మాలినిగౌడ్, ఐఎఎస్ మనీష్‌కుమార్‌లు కలిసి స్వచ్ఛతపై ప్రత్యేక ప్రణాళికలు రచించారని, అక్కడున్న వర్కర్లు నిర్దేశించిన సమయానికి చేయాల్సిన పనులన్నీ పూర్తి చేస్తున్నారన్నారు. ప్రణాళిక ప్రకారం కింది నుండి పైస్థాయి వరకు అందరు కలిసికట్టుగా అమలు చేస్తున్నందువలన ప్రస్తుతం దేశంలోనే స్వచ్ఛతలోనే సెవెన్‌స్టార్స్ మున్సిపాలిటీగా నిలిచిందన్నారు. అక్కడ అమలవుతున్న విధానాలన్నింటినీ మున్సిపల్ కౌన్సిలర్లతో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు. అక్కడ అమలవుతున్న విధానాలనే పులివెందులలో కూడా అమలు చేస్తామని వచ్చే వారం నుండే పక్కా ప్రణాళిక ద్వారా స్వచ్ఛతలో అన్నివిధానాలను పాటిస్తామని, పులివెందులను కూడా పక్కాగా స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ప్రణాళికల అమలులో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఇప్పటికే ఢిల్లీలో పులివెందుల మున్సిపాలిటీకి అవార్డు దక్కిందన్నారు. మరోసారి దేశంలోనే ప్రథమంగా నిలిచేలా మరింత కష్టపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మిభార్గవి, కాంతమ్మ, అర్కటవేముల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రికి ముస్తాబయిన మూలస్థానేశ్వర ఆలయం



రామాపురం.ఫిబ్రవరి17

ప్రభాతవార్త

మండలంలోని మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలును అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. మండలంలోని హసనాపురం గంగాభవాని సమేత మూలస్థానేశ్వర స్వామి శివాలయం రాచపల్లిలోని శివాలయంలో చిట్లూరులోని శివాలయం నల్లగుట్టపల్లి శివాయం, గువ్వలచెరువు ఘాట్ పైన ఉన్న శివాలయంలో అంగరంగ వైభవంగా సర్వాంగ సుందరంగా పెద్ద దీపాలంకరణలతో ఏర్పాటు చేశారు. శనివారం మహాశివరాత్రి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని వచ్చే భక్తులకు హాయ్ ఆ శివాలయాలలో అన్నదాన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. హసనాపురం గంగాభవాని సమేత మూలస్థానేశ్వర ఆలయంలో ఆలయ కమిటి ఛైర్మన్ జరుగు చలమారెడ్డి ఆద్వర్యంలో శివాలయం గంగాభవాని సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో హసనాపురం. అన్ని పుణ్యక్షేత్రాలలో విగ్రహ ప్రతిష్ట చేశారు. కొద్ది రోజుల్లోనే దేవాలయ అధ్యక్షులు పప్పిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కాంట్రాక్టర్ అందరని పిలిపించి శివాలయం పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి అకౌంట్‌లో ఓపెన్ చేసి కమిటి సభ్యులు ద్వారా ఏర్పాటు చేయడం జరిగింది. ట్రస్ట్ ఏర్పాటు చేసి తరువాత శివాలయంకు పూజలు ఊపందుకున్న సందర్భంలో మహాశివరాత్రి రావడం గొప్ప విశేషం. శనివారం రాత్రికి చెక్కభజనలు, కోలాటాలు, చాందిని బండ్లతో అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటి సభ్యులు సివి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కమిటి సభ్యులు అందరూ సహకరించి మరింత అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు.


## మామిడి తోటకు నిప్పు..... చెట్లు పూర్తిగా దగ్ధం

టి.సుండుపల్లి.ఫిబ్రవరి17 ప్రభాతవార్త

మండలంలోని తిమ్మసముద్రం గ్రామం బి.రెడ్డివరిపల్లికు చెందిన దేవపట్ల చెన్నక్రిష్ణమ్మకు చెందిన మామిడి చెట్లు అగ్నికి ఆహుతై దగ్ధమైనట్లు తహశీల్దార్, ఎస్ఐలకు పిర్యాదు చేసినట్లు కృష్ణమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా తిమ్మసముద్రం సర్వే నంబర్ 9851.12 లో గత పది సంవత్సరాల వయస్సు గల మామిడి చెట్లు బుదవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించి తమకు భారీ నష్ట కలిగించారని వారు ఆపిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి తమకు నష్టపరిహారం అందించేలా చూడాలని వారు వివరించారు.

## మందపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సస్పెన్షన్

### డిఇఒ ఉత్తర్వులు జారీ



రాజంపేట అర్బన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

మండలంలోని మందపల్లె అరుంధతివాడ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటి డి.వెంకటేశులును సస్పెన్షన్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి వై.రాఘవరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశులు గత రెండేళ్లుగా విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నారని, పాఠశాలకు వచ్చినా సక్రమంగా విద్యాబోధన చేయడంలేదని, క్లాస్‌రూంలో నిద్రపోవడం, ఎప్పుడూ ఫోన్లో మాట్లాడుతుండడం చేస్తున్నారని స్థానికులు డిఇఒకు ఫిర్యాదు చేశారు. ఎంఇఒ కూడ విచారించారు. డిఇఒ కూడా విచారణ చేపట్టారు. విచారణలో వెంకటేశులు ప్రవర్తన నిర్ధారణ కావడంతో డిఇఒ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## వేంపల్లె అమ్మవారిశాలలో రాముని పిలుపు.. వడ్ల వొలుపు



వొలిచిన వడ్లను చూపుతున్న దృశ్యం

వేంపల్లె, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త :

వేంపల్లెలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో రాముని పిలుపు.. వడ్లవలుపు కార్యక్రమం నిర్వహించారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వడ్లకుంట రాజారావు తెలిపారు. ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ మాట్లాడుతూ అమ్మవారిశాలలో ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్‌శర్మ నేతృత్వంలో వడ్లకు పూజ నిర్వహించి అనంతరం అయోధ్య భద్రాద్రి రామయ్యకు తలంబ్రాల కల్యాణం వడ్లు వొలిచే కార్యక్రమం నిర్వహించామన్నారు. రాబోయే శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం, అయోధ్యలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి అవసరమైన కోటి తలంబ్రాల బియ్యం కోసం కోటివడ్లలో భాగంగా తమ వంతు వడ్లు వొలిచే అవకాశం దక్కడం తమ అదృష్టమని తెలిపారు. శ్రీరామ నామస్మరణతో గోటితో ధాన్యపు గింజలు వొలిచారని తెలిపారు. ఈ అవకాశం దక్కడం తాము చేసుకున్న పుణ్యమని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ గ్రామంలో శ్రీకృష్ణచైతన్య సంఘం ప్రత్యేకంగా వరిపంటను పండించి ఆ వడ్లను అన్ని గ్రామాలకు పంపిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వొలిచే వడ్లను భద్రాచలం అయోధ్యలో నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి పంపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సెక్రెటరీ సంధ్యారాణి, జాయింట్ సెక్రెటరీ నిర్మల, సభ్యులు మృదుల, అనురాధ, సునీత, శైలజ, లక్ష్మిమాధవి, వాణి, శ్రీదేవి, ఆర్యవైశ్య యువన సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల హరిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అడవి యాత్రల్లో భక్తులు జాగ్రత్తలు పాటించాలి

### సిఐ ఎస్ విశ్వనాధ్‌రెడ్డి




రైల్వేకోడూరు రూరల్,

ఫిబ్రవరి 17 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణానికి చెందిన శివరాత్రి భక్తులు అన్ని యాత్రలకు వెళ్లేవారు అటవీ ప్రాంతంలో జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా అడవి జంతువులు ఉంటాయని, అడవికి నిప్పు పెట్టడం తదితర నియమ నిబంధనలను భక్తులు పాటించాలని అన్నారు. ఇటీవల అటవీ సమీప ప్రాంతాల్లో ఉన్న శైవక్షేత్రాలను భక్తులకు అనుకూలంగా ఏర్పాట్లను చేశామని, చిన్నారులతో వెళ్లే భక్తులు సంబంధిత జాగ్రత్తలు పాటించి సురక్షితంగా మొక్కులు చెల్లించుకొని తిరిగి వారి గ్రామాలకు చేరాలని అందుకోసం 3 మండలాల్లో పోలీసు యంత్రాంగాన్ని కూడా కట్టుదిట్టంగా ఏర్పాటు చేసినట్లు రైల్వేకోడూరు సిఐ ఎస్.విశ్వనాధ్‌రెడ్డి అన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధంకండి

**-ఏపిజిఇఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కరరావ్**




రాయచోటి టౌన్.ఫిబ్రవరి17 ప్రభాతవార్త

ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధంకండని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మదనపల్లి రోడ్డులోని ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయంలో జిల్లా స్థాయి ఉద్యోగులు సమావేశం జిల్లా అధ్యక్షుడు యర్రపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరై ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమస్యలు పరిష్కారం కాకుంటే ఏప్రిల్ నుంచి దశలవారిగా ఉద్యమిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బకాయి పడ్డ ఆర్థిక ప్రయోజనాలను సకాలంలో చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులు జీపిఎఫ్, ఏపిజిఎల్ఐ సేవింగ్స్ ఖాతాల నుంచి రుణాలు విడుదల చేయ కపోవడం జీతాలు సకాలంలో చెల్లించకపోవడం, పిఆర్‌సీ సమస్యలు పరిష్కారం చేయకపోవడం పట్ల ఉద్యోగులలో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింద న్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యోగులు మాట్లా డుతూ ఉద్యోగ పెన్షనర్లకు ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని 11వ పిఆర్‌సి ద్వారా రావలసిన ఆర్థిక ప్రయోజనాలు బకాయిలు చెల్లి ంపు షెడ్యూల్ ప్రకటించాలని జీపిఎఫ్ ఖాతాల నుంచి అనుమతి లేకుండా విత్‌డ్రా చేయబడిన 480 కోట్లను తిరిగి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సరెండర్ లివ్ ఎన్కాష్మెంట్ నిర్దిష్ట కాలపరిధిలోగా చెల్లించాలని ఎల్‌టిసి హోమ్ టౌన్ సదుపాయాలను నిర్దిష్ట కాలపరిమితిని విధించి చెల్లించాలని వారు తెలిపారు. సిపిఎస్ ఉద్యోగుల వాటాకు ప్రభుత్వ వాటా కలిపి మొత్తాన్ని 20వ తేదీ లోపు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం వంటి డిమాండ్‌లపై తక్షణం ప్రభుత్వం చర్చలకు పిలిచి పరిష్కారం చేయని పక్షంలో ఏప్రిల్ ఒకటి నుంచి దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు, కార్యదర్శి ఎస్.బాబాసాహేబ్,కృష్ణాజిల్లా అధ్యక్షుడు సత్యానారాయణబాబు, విశాఖజిల్లా కార్యదర్శి రవిశంకర్, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజి, జిల్లా కోశాధికారి సుధాకర్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డినాయక్, వివేకానంద, రెవెన్యూ సంఘం అధ్యక్షుడు రమేష్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ డిపార్టమెంట్ రమేష్, కృష్ణవేణి, తాలూకా అధ్యక్షులు సాయికుమార్, కార్యదర్శి సుజిత్, శ్రీనివాసులు నాయక్, సదాశివరెడ్డి, వలి, కవిత, సావిత్రి, హౌస్ బిల్డింగ్ డైరెక్టర్ సిద్దయ్య, కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ స్టేట్ కన్వీనర్

## నర్సింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం



కడప, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :

పట్టణంలోని ఒక ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో బిఎస్సీ నర్సింగ్ చదువుతున్న చింతమాను మౌనిక అనే విద్యార్థికి వివేకానంద ఫౌండేషన్ సంస్థ బాసటగా నిలిచింది. వీరపునాయుని పల్లె మండలంలోని అనిమెల గ్రామానికి చెందిన మౌనిక కు తండ్రి లేడు. తల్లి సుబ్బమ్మ కూలీనాలీ చేసుకుంటూ తన కూతురిని చదివించేందుకు ఆర్థిక స్థోమత లేక అవస్థలు పడేది. తన కూతురి చదువుకు ఆర్థిక సాయం అందించాలని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డిని కోరింది. ఆయన శుక్రవారం కళాశాలకు వెళ్ళి ఈ ఏడాది ఫీజు 21,000 రూపాయలను చెక్కు రూపంలో మౌనికకు అందించి భరోసా కల్పించారు. సాయం పొందిన మౌనిక, ఆమె తల్లి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

## టిప్పర్ స్కూటర్ ఢీకొని ఇరువురికి తీవ్రగాయాలు

రామాపురం.ఫిబ్రవరి17 ప్రభాతవార్త

కర్నూలు చిత్తూరు 40వ జాతీయ రహదరాలోని రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ స్కూటర్‌ను ఢీకొని అంజి, రంగా అనే ఇరువురికి తీవ్రగాయాలయినట్లు రామాపురం పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడపకు చెందిన వీరు బేల్దారి పని కోసం రాయచోటికి వచ్చి పని ముగించుకుని తిరిగి కడపకు స్కూటర్‌లో ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలోకి కొత్తరోడ్డు నారాయణపురం సమీపానికి రాగానే టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరి కాళ్లకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరకున్న పోలీస్‌లు 108 సహాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

## ఎఫ్‌జి డ్రైవింగ్ స్కూల్ ప్రారంభంలో ఎమ్మెల్యే, శాసనమండలి డిప్యూటి ఛైర్‌పర్సన్ జకియా ఖానం



రాయచోటి.ఫిబ్రవరి17

ప్రభాతవార్త

రాయచోటి పట్టణంలోని చిత్తూరు మార్గంలో మహారాజ పైపుల ఫ్యాక్టరీ సమీపంలో కరమల ఫైజుల్లాచే నూతనంగా ఏర్పాటయిన ఎఫ్‌జి డ్రైవింగ్ స్కూల్ ప్రారంభంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటి ఛైర్‌పర్సన్ జకియా ఖానంలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాష, మదనపల్లి పరిశీలకులు హబీబుల్లాఖాన్, మాజీ కో ఆప్సన్ సభ్యులు ఆలీనవాజ్‌ఖాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, కొలిమి హారూన్, తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి ఇష్టపడి చదివినపుడు ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చు

**- ఐఎఫ్ఎస్ అధికారి బుడిగి శ్రీనివాసులు రెడ్డి**



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐఎఫ్ఎస్ అధికారి బుడిగి శ్రీనివాసులు రెడ్డి

బద్వేలు అర్బన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :

విద్యార్థులు కష్టపడి ఇష్టపడి చదివినపుడు ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ప్రధానమంత్రి కార్యాలయంలోని విదేశాంగ శాఖలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్న ఐఎఫ్ఎస్ అధికారి బుడిగి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దవటం రోడ్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ముఖ్య అతిధిగా విచ్చేసిన వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్న వయసు నుండి కష్టపడి ఇష్టంతో చదివి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిరంతర సాధనతో కృషి చేసినట్లయితే అనుకున్న లక్ష్యాన్ని తప్పకుండా చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు ఎంతటి స్థాయికి చేరుకున్నా విద్యా బుద్ధులు నేర్పిన గురువులను మరువరాదన్నారు. తాము అనుకున్న లక్ష్యాలు నెరవేరాలంటే నిరంతరాయంగా కష్టపడి చదివినపుడే తమ లక్ష్యాలను చేరుకుంటూ చదువు చెప్పిన గురువులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చినవారు అవుతారన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించి ఎలాంటి ఒత్తిడి లేకుండా కష్టపడి చదివి గురువులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని వారు పేర్కొన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ రాజమనోహర్ రెడ్డి మాట్లాడుతూ అను నిత్యం ఎంతో బిజీగా ఉండే శ్రీనివాసులు రెడ్డి తమ లాంటి చిన్న పాఠశాలకు వచ్చి విద్యార్థులకు అమూల్యమైన సందేశాలు ఇవ్వడం తమ అదృష్టంగా భావించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

